## మంచిమాట

నీకున్నదంతా ఏదో ఒకరోజున ఇచ్చేయాల్సిందే. నీవెంట ఏదీ తీసుకెళ్ళలేవు. అంచేత ఆ ఇచ్చేదేదో ఇప్పుడే ఇవ్వు. ఇచ్చే గొప్ప అవకాశాన్ని నువ్వే వాడుకో. ఇవ్వడంలోని ఆనందాన్ని అనుభవించాల్సింది నువ్వేకానీ నీ వారసులు కాదు.


నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 31 ఆదివారం, అక్టోబర్ 26, 2025 , పేజీలు - 12 వెల : 2/-


# హైదరాబాద్‌లో ఆర్టీఏ మెరుపు దాడులు..

## ప్రైవేట్ బస్సులపై కొరడా.. పలు బస్సుల సీజ్

- కర్నూలు బస్సు అగ్నిప్రమాదం నేపథ్యంలో ఆర్టీఏ అప్రమత్తం
- హైదరాబాద్ వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్‌పై ముమ్మర తనిఖీలు
- బండ్లగూడలో 12 బస్సులపై కేసులు, 8 వాహనాల సీజ్



**హైదరాబాద్ :** కర్నూలులో జరిగిన బస్సు అగ్ని ప్రమాదం ఘటన నేపథ్యంలో తెలంగాణ రవాణా శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ వ్యాప్తంగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పలు వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు కొన్నింటిని సీజ్ చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలతో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు బెంబేలెత్తారు. **మిగతాది 2లో...**

# మద్యం మత్తు లో బైకర్ నిర్లక్ష్యం

## కర్నూలు బస్సు ప్రమాదంలో వీడిన మిస్టరీ

- బైక్ వెనుక కూర్చున్న ఎర్రిస్వామి అనే యువకుడ్ని ప్రశ్నించిన పోలీసులు
- బైక్‌ను బస్సు ఢీకొట్టలేదని తేలిన వైనం
- ముందుగా బైక్ స్కిడ్ అయి డివైడర్‌ను ఢీకొట్టిందని నిర్ధారణ
- కిందపడిన బైక్‌ను బస్సు ఈడ్చుకెళ్లడంతో మంటలు

**కర్నూలు :** కర్నూలు జిల్లాలోని చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం వెనుక ఉన్న మిస్టరీ వీడింది. తొలుత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, బైక్‌ను నేరుగా ఢీకొట్టడం వల్లే మంటలు చెలరేగాయని భావించగా, పోలీసుల దర్యాప్తులో అది తప్పని తేలింది. బైక్‌పై వెనుక కూర్చుని ప్రయాణిస్తూ స్వల్ప గాయాలతో బయటపడిన ఎర్రిస్వామిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. **మిగతాది 2లో...**



# 'మొంథా' తుపాను వస్తోంది...

## అప్రమత్తంగా ఉండండి

: సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

'మొంథా' తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్ జారీ



2లో.

## అమరులకు..ఉద్యమకారులకు

# తీరని అన్యాయం

- గత పదేళ్లలో వారికి సరిగా ఉద్యోగాలు ఇవ్వలేదు
- వారిని ఆదుకోవడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం విఫలం
- అంతర్గతంగా తాను కొట్లాడినా న్యాయం జరగలేదు
- జాగృతి జనంబాట ప్రారంభంలో కవిత భావోద్వేగం



**హైదరాబాద్,అక్టోబర్25 :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భావోద్వేగానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అమరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యమకారుల కోసం పోరాడలేకపోయామని, అమరవీరుల కుటుంబాలకు అనుకున్నంత న్యాయం చేయలేకపోయామని భావోద్వేగానికి లోనయ్యారు. **మిగతాది 2లో...**



# అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం..

- హరీశ్‌కు అడ్లూరి సవాల్
- కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అనడంపై మంత్రి అడ్లూరి ఫైర్
- హరీశ్ రావుకు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న అడ్లూరి

2లో.



# జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

- కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బుద్ధి వస్తుంది
- లేదంటే అదే నిర్లక్ష్యంతో పాలన సాగిస్తారు
- పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,అక్టోబరు25 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. రెండేళ్లలో కేసీఆర్‌ని తిట్టడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏమి చేశారని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం వచ్చిందని కేటీఆర్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం అవుతుందని చెప్పారు. మోసాన్ని మోసంతోనే జయించాలని కేటీఆర్ పేర్కొన్నారు. **మిగతాది 2లో...**

# చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు

## బీహార్ ప్రచారంలో అమిత్ షా స్పష్టీకరణ



**పాట్నా,అక్టోబర్25:** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఖగడియా జిల్లాలో అధికార, ప్రతిపక్ష నేతలు నేడు పోటాపోటీ ప్రచార సభలు నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ను వ్యతిరేకించిందంటూ 'ఇండియా' కూటమిపై **మిగతాది 2లో...**

## ఆధార్ లింక్ చేయకపోతే

# జీతాలు బంద్!

- తెలంగాణ ఉద్యోగుల వేతనాలకు ఆధార్ లింక్ తప్పనిసరి
- నిబంధన పాటించని ఉద్యోగుల జీతాలు నిలిపివేస్తామని హెచ్చరిక
- అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకే ఈ నిర్ణయమన్న ఆర్థిక శాఖ



2లో.

# ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు

- ఇంటర్ విద్యావిధానంలో మార్పులు
- వచ్చే ఏడాది నుంచే అమల్లోకి కొత్త సిలబస్



**హైదరాబాద్,అక్టోబర్25 :**

తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. 2026 ఫిబ్రవరి 25 వ తేదీ నుంచి మార్చి 18 వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను ఆయన మీడియాకు తెలిపారు. ఇంట ర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో కూడా ల్యాబ్స్, ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్ ఉంటాయని, ఇంగ్లీష్‌లో ఉన్నట్లుగానే మిగతా భాషల్లోనూ ప్రాక్టికల్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. 12 ఏళ్ల తర్వాత ఇంటర్ సిలబస్‌లో మార్పులు జరగబోతున్నట్లు తెలిపారు. **మిగతాది 2లో...**

## హైదరాబాద్‌లో ఆర్టీఏ మెరుపు దాడులు..

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా బండ్లగూడ, వనస్థలిపురం ప్రాంతాల్లో ఆర్టీఏ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 60కి పైగా వాహనాలను తనిఖీ చేయగా, నిబంధనలు పాటించని 12 బస్సులపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు, భద్రతా ప్రమాణాలు లేని 8 బస్సులను అక్కడికక్కడే సీజ్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మరోవైపు సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఓఆర్ఆర్ ఎగ్జిట్-3 వద్ద, రాజేంద్రనగర్ పరిధిలోని గగన్‌పహాడ్ వద్ద కూడా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులను ఆపి సోదాలు నిర్వహించారు. బస్సుల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు, మెడికల్ కిట్ల లభ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎల్బీనగర్‌లోని చింతలకుంట వద్ద కూడా పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు.ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీలు రాబోయే రోజుల్లోనూ కొనసాగుతాయని వారు స్పష్టం చేశారు.

## చొరబాటుదారులను ఉపేక్షించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తించి, వారి స్వదేశానికి తరలిస్తామన్నారు. బిహార్‌లో జంగల్‌రాజ్ తిరిగి వస్తుందా? లేదా రాష్ట్రం అభివృద్ధి మార్గంలో కొనసాగుతుందా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు.చొరబాటుదారులను కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్ని యాత్రలైనా నిర్వహించ నివ్వండి. ఏం చేసినా.. వారిని ఆయన రక్షించలేరు. ప్రతి ఒక్క చొరబాటుదారుడిని గుర్తిస్తాం. ఓటరు జాబితా నుంచి పేరును తొలగిస్తాం. వారి స్వదేశానికి పంపిస్తాం అని అమిత్ షా స్పష్టం చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కేవలం తన కుటుంబ ప్రయోజనాలపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నీతీశ్‌కుమార్ మాత్రం రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ పాలనలో హత్యలు, దోపిడీలు తదితర అనేక నేరాలు యథేచ్ఛగా జరిగాయని, కానీ.. ఎన్డీయే హయాంలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని చెప్పారు. జంగల్‌రాజ్ తిరిగి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఇదిలావుంటే కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకే ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, బిహార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తెలిపారు. ప్రతిపక్ష కూటమి అధికారంలోకి వస్తే.. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు 20 రోజుల్లోపు చట్టం తీసుకొస్తామన్నారు. 20 నెలల్లో నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖగడియాలోని గోగ్రీలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. బిహార్‌ను నంబర్ వన్‌గా మార్చేందుకు.. పెట్టుబడులు తీసుకురావడం, విద్యను ప్రోత్సహించడం, వైద్య సౌకర్యాలను మెరుగుపర్చడం అవసరమని పేర్కొన్నారు.

## ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

. మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సిలబస్ మారబోతున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్ విద్యా విధానంలో మార్పులతో పాటు పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో కూడా ల్యాబ్స్ , ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉంటాయి.. అలాగే, ఇంటర్ సిలబస్ లోనూ మార్పులు చేసినట్లు ప్రకటించారు. 12 సంవత్సరాల తర్వాత మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బొటనీ, జువాలాజీలో సిలబస్ లో మార్పులు జరిగాయని ప్రకటించారు. హ్యూమానిటీస్ స్జబెక్టుల్లో యాక్టివిటీ బేస్డ్ సిలబస్ ఏప్రిల్ మొదటి వారంలో బుక్స్ అందుబాటులోకి వస్తాయని ఇంటర్ బోర్డు సెక్రటరీ వెల్లడించారు. అలాగే, కొత్త కోర్స్ కోర్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య చెప్పుకొచ్చారు. ఇంగ్లీష్ లో ఉన్నట్టు గానే మిగతా లాంగ్వేజెస్ లోనూ ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇకపై 80 మార్కులు ఎక్స్‌టర్నల్, 20 మార్కులు ఇంటర్నల్ మార్కులుగా ఉంటాయన్నారు. ల్యాబ్ ప్రాక్టికల్స్ ప్రతి సంవత్సరం 15 మార్కుల చొప్పున నిర్వహించనున్నారు. అంతేకాకుండా, ఫిబ్రవరి 25వ తేదీ నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య తెలిపారు.

## మద్యం మత్తు లో బైకర్ నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

శివశంకర్, అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఇద్దరూ బైక్‌పై లక్ష్మీపురం నుంచి రాత్రి 2 గంటలకు బయలుదేరారు. ఎర్రిస్వామిని ఇంటి వద్ద దించేందుకు శివశంకర్ తుగ్గలి బయల్దేరాడు. మార్గమధ్యంలో కియా షోరూం వద్ద ఓ పెట్రోల్ బంకులో ఇంధనం నింపుకున్నారు. రోడ్డుపైకి వచ్చిన కొద్దిసేపటికే వారి బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. వేగంగా కుడివైపున ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలైన ఎర్రిస్వామి, రోడ్డుపై ఎగిరిపడిన తన స్నేహితుడిని, రోడ్డు మధ్యలో ఉన్న బైక్ ను పక్కకి తీయాలని అనుకున్నాడు.శివశంకర్‌ను రోడ్డు పక్కకు లాగేందుకు ఎర్రిస్వామి ప్రయత్నిస్తున్న సమయంలోనే, ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చింది. రోడ్డు మధ్యలో పడి ఉన్న వారి బైక్‌ను చాలాదూరం ఈడ్చుకెళ్లింది. దాంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. ఈ క్రమంలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. బస్సు మంటల్లో చిక్కుకోవడం చూసిన ఎర్రిస్వామి భయపడి తన స్వగ్రామం తుగ్గలి వెళ్లిపోయాడు. కాగా, ఈ ఘోర దుర్ఘటనలో 19 మంది ప్రయాణికులు సజీవదహనమైనట్లు రాష్ట్ర హెూంమంత్రి అనిత నిన్న ప్రకటించిన విషయం విదితమే. మొదట ఇది రోడ్డు ప్రమాదంగా భావించినా, ఎర్రిస్వామి వాంగ్మూలంతో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై స్పష్టత వచ్చింది.

## ‘మొంథా’ తుపాను వస్తోంది...
### అప్రమత్తంగా ఉండండి

**: సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ ‘మొంథా’ తుపాను ముప్పుతో ఏపీకి రెడ్ అలెర్ట్**

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై ‘మొంథా’ తుపాను విరుచుకుపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. యూఏఈ పర్యటన నుంచి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తుపాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు.

ఎక్కడా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు.వాతావరణ శాఖ జారీ చేసిన రెడ్ అలెర్ట్‌ను ప్రస్తావిస్తూ, ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తుపాను ప్రభావం రాష్ట్రంపై తీవ్రంగా ఉంటుందని సీఎం తెలిపారు. ముఖ్యంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో ‘మొంథా’ తీవ్ర తుపానుగా తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అంచనా వేస్తున్నట్లు వివరించారు. దీని ప్రభావం శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకు ఉంటుందని, 80 నుంచి 100 మిల్లీమీటర్ల మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుంచే సమగ్ర సన్నాహక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.“ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే ముఖ్యమైనది ఏదీ లేదు. ప్రతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలి. తక్షణమే సహాయ క చర్యలు చేపట్టేందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి” అని చంద్రబాబు నిర్దేశిం చారు.

## అమరులకు..ఉద్యమకారులకు తీరని అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యమకారులకు న్యాయం జరిగేవరకు పోరాడనందుకు బహిరంగ క్షమాపణ చెప్పారు. కాగా, కవిత శనివారం నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమం నిర్వహించనున్నారు. వరుసగా 4 నెలలపాటు ప్రజలతో ఉండేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. నిజామాబాద్ నుంచి జనంబాట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజలు కోరుకుంటే కొత్త పార్టీని పెట్టేందుకు కూడా సిద్ధమని కవిత ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కవిత శనివారం 'జాగృతి జనం బాట' పేరుతో రాష్ట్రవ్యాప్త పర్యటనను ప్రారంభించారు. ఈ యాత్రకు ముందుగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమరవీరుల కుటుంబాలకు, తెలంగాణ ఉద్యమకారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయామని అంగీకరిస్తూ, వారికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణ త్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు



అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపిగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నానని కవిత అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వకపోతే రాబోయే ప్రభుత్వంతోనైనా ఇప్పించి తీరుతామని ఆమె హామీ ఇచ్చారు. 'సామాజిక తెలంగాణ' సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని? సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ‘ తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం ‘ అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కవిత పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్ నుంచే బిఆర్ఎస్ జైత్రయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట్ డివిజన్ బీజేపీ పార్టీ మాజీ అధ్యక్షుడు తోట మహేష్ ముదిరాజ్, తన అనుచరులతో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మహేష్‌తో పాటు ఆయన అనుచరులకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరంమీడియాతో కేటీఆర్ మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో హామీలిచ్చి ఒక్క పైసా కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ఓటు కోసం కాంగ్రెస్ నేతలు ప్రమాణం చేస్తారని.. ఆ తర్వాత పట్టించుకోరని ఎద్దేవా చేశారు. మళ్లీ కేసీఆర్‌ని అధికారంలోకి తెచ్చుకోవటానికి.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర ప్రారంభం కావాలని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే తాము మోసం చేసినా తమకు ఓటు వేశారని.. ఆ పార్టీ నేతలు చెబుతారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులకి మధ్య సయోధ్య లేక కొట్టుకుంటున్నారని



విమర్శించారు. కాంగ్రెస్ నేతలు జాదూగాళ్లు అని దెప్పిపొడిచారు. అన్ని మతాల వారిని, అన్నివర్గాల వారిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆక్షేపించారు. మైనార్టీ సబ్ ప్లాన్ పెడతామన్నారని.. అది కూడా ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఓటు అడగటానికి కాంగ్రెస్ నేతలు వస్తే బాకీ కార్డు చూపెట్టాలని సూచించారు. అవ్వా, తాతలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని అన్నారని.. ఇచ్చారా అని నిలదీశారు. మహిళలకు రూ. 2500 ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వాస్తవం కాలేదని, పేదల ఆశలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రజల కష్టాలు తగ్గాయి. ఉచిత మంచినీళ్లు, బస్తీ దవాఖానాలు, రూ.5 భోజనం, పింఛన్లు, రంజాన్ తోఫాతో పాటు అనేక పథకాలు అమలు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడేమో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను బకాయిలతో ముంచేసింది. వృద్ధులు, రైతులు, మహిళలు అందరిని కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేం మోసపోయాం.. కానీ ఇప్పుడు జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోవద్దు. అందుకే మేం కూడా జూబ్లీహిల్స్‌కు వచ్చి ప్రచారం చేస్తామని గ్రామల నుంచి రైతులు, ప్రజలు చెబుతున్నారని అన్నారు. మోసాన్ని మోసంతోనే జయించాలి. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవాలి. తెలంగాణలోని గరీబోళ్లు, కార్మికులు, రైతులు అందరూ జూబ్లీహిల్స్ వైపు చూస్తున్నారు. జైత్రయాత్ర ఇక్కడి నుంచే ప్రారంభమవుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. వచ్చే నెల 11న జరిగే పోలింగ్‌లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కేటీఆర్ కోరారు. మీ ఓటు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని కాపాడుకుందాం అని ఆయన పిలుపునిచ్చారు.

## ఆధార్ లింక్ చేయకపోతే జీతాలు బంద్!

**తెలంగాణ ఉద్యోగుల వేతనాలకు ఆధార్ లింక్ తప్పనిసరి**

**హైదరాబాద్,అక్టోబర్25**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ఆర్థిక శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. ఉద్యోగులందరూ తమ ఆధార్ వివరాలను ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పోర్టల్ (ఐఎఫ్ఎంఐఎస్)తో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఈరోజు (అక్టోబర్ 25) అర్ధరాత్రి వరకు గడువు విధించింది. గడువులోగా ఆధార్ వివరాలు నమోదు చేయని ఉద్యోగులకు ఈ నెల జీతాల చెల్లింపు నిలిపివేస్తామని తేల్చి చెప్పింది. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కలిపి సుమారు 10.14 లక్షల మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరందరి పేరు, హెూదా, ఆధార్, ఫోన్ నంబర్ వంటి వివరాలను ప్రతి నెలా 10వ తేదీలోగా ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని గత నెలలోనే ఆర్థిక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఈ నెల 16వ తేదీ నాటికి సగం మంది ఉద్యోగులు కూడా తమ వివరాలను నమోదు చేయలేదు. దీంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. వివరాలు సమర్పించని వారి జీతాల బిల్లులను ప్రాసెస్ చేయవద్దని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వెనుక ప్రధానంగా ఉద్యోగుల వివరాల్లో పారదర్శకత లేకపోవడం, కొన్నిచోట్ల అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు రావడమే కారణంగా తెలుస్తోంది. కొన్ని కార్యాలయాల్లో ఉద్యోగం మానేసినా లేదా అనధికారికంగా దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నా వారి పేర్ల మీద జీతాలు డ్రా చేస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఆధార్, పేరు, మొబైల్ నంబర్ వంటి వివరాలను అనుసంధానించడం ద్వారా అసలైన ఉద్యోగుల సంఖ్యను తేల్చవచ్చని, తద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. పలుమార్లు సూచించినా కార్యాలయాలు స్పందించకపోవడంతో ఆర్థిక శాఖ ఈసారి గడువు విధించి హెచ్చరికలు జారీ చేసింది.

## అంబేద్కర్ విగ్రహం దగ్గర తేల్చుకుందాం..

**హరీశ్‌కు అడ్లూరి సవాల్**


**కేబినెట్‌ను దండుపాళ్యం బ్యాచ్ అనడంపై మంత్రి అడ్లూరి ఫైర్**

**హరీశ్ రావుకు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన మంత్రి**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమన్న అడ్లూరి**

**హైదరాబాద్,అక్టోబర్25**

రాష్ట్ర కేబినెట్ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన ‘దండుపాళ్యం బ్యాచ్’ వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ హరీశ్ రావుకు



ఆయన సవాల్ విసిరారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు తాము వస్తామని, చర్చకు మీరు వస్తారా? అని సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేటలో ఈరోజు మీడియాతో మాట్లాడిన అడ్లూరి లక్ష్మణ్.. హరీశ్ రావు వ్యాఖ్యలు చాలా బాధ కలిగించాయన్నారు. “ఒక ఉద్యమ నాయకుడు అయి ఉండి కేబినెట్‌ను అలా సంబోధించడం సిగ్గుచేటు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీలో హరీశ్ రావు మంత్రిగా పనిచేశారు, ఆ విషయం ఆయన మరవొద్దు. మా కేబినెట్ మీటింగ్ ప్రజల అవసరాల కోసమే... అంతే తప్ప, దండుపాళ్యంలా దోచుకోవడానికి కాదు” అని ఆయన స్పష్టం చేశారు.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడటం దారుణమన్నారు. ఒక మాజీ ఎమ్మెల్యేతో, తన భజన మండలితో తనను తిట్టించడం ఎంతవరకు సమంజసమని హరీశ్‌ను ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 20 నెలలు కూడా కాకముందే ఇంతగా టార్గెట్ చేయడం సరికాదన్నారు. దళిత ముఖ్యమంత్రి, ఇంటికో ఉద్యోగం లాంటి హామీలను బీఆర్ఎస్ నెరవేర్చిందా? అని నిలదీశారు. పదేళ్లలో ఒక్కరికైనా నియామక పత్రం ఇచ్చారా? అని అడిగారు.

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక

# అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నగరంలో 20 కి.మీ సైకిల్ ర్యాలీ సీపీ గౌష్ ఆలం







**చర్చ :- కరీంనగర్ :**కరీంనగర్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో నగరంలో 20 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని కరీంనగర్ పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీలో కరీంనగర్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, డాక్టర్లు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### ర్యాలీ మార్గం వివరాలు:

శనివారం ఉదయం పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, శివ థియేటర్ సర్కిల్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగింది. అనంతరం ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుని, కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, బోట్ చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్, ప్రతిమ మల్టీప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగిసిందని సీపీ తెలిపారు. కార్యక్రమ అనంతరం సీపీ ర్యాలీలో పాల్గొన్న సభ్యులకు అమరవీరుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ర్యాలీలో పాల్గొన్న సభ్యులందరికీ సీపీ చేతుల మీదుగా మెడల్స్ అందించారు.

### అక్టోబర్ 31 వరకు వారోత్సవాలు:

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశ్యంతో అక్టోబర్ 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ శ్రీ గౌష్ ఆలం తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీంరావు, ఏసిపిలు వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, మాధవి, కమిషనరేట్ చెందిన ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. వీరితో పాటు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, కరీంనగర్ కమిషనరేట్ రన్నర్స్ మరియు సైక్లిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేష్ పాసుల, డాక్టర్ అజయ్ ఖండాల, డాక్టర్ కిరణ్ లతో పాటు పాఠశాల విద్యార్థులు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- వ్యవసాయ విస్తరణ అధికారులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను సందర్శించాలి
- కొనుగోళ్లు, తేమ శాతం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలి
- క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్
- మెప్మా ఆధ్వర్యంలో పెద్దూర్ లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన





**చర్చ:- కరీంనగర్. సిరిసిల్ల :**కొనుగోలు కేంద్రాలను రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని తేమ శాతం ఆధారంగా, నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఆదేశించారు.శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూర్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో సందర్శించి, కేంద్రంలో రైతుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. 17 శాతం తేమ రాగానే ఆలస్యం చేయకుండా కొనుగోళ్ళు ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, క్షేత్ర స్థాయిలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను తప్పకుండా సందర్శించి, రైతులకు వచ్చే సందేహాలను నివృత్తి చేస్తూ, అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. కేంద్రంలోని రిజిస్టర్ లను పరిశీలించి, వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీ లో తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు.కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారులు ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తే ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తవుతుందని పేర్కొన్నారు. గ్రేడ్ - ఏ రకానికి రూ. 2,389, కామన్ రకానికి రూ. 2,369 ధర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆర్డీఓ లు, తహశీల్దార్లు తప్పనిసరిగా తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి, పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. సందర్శనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, పౌరసరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాష్, తహశీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏఓ మీర్జా ఫసాహత్ అలీ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఆర్ఆర్ కళాశాలలో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ కళాశాల హాస్టళ్లను మంజూరుచేయాలి
- గట్టు ఆకాష్ ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి




**చర్చ :- కరీంనగర్ :**భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల గేట్ ముందు పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని మరియు నూతన హాస్టల్ లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రభుత్వం పైన వారు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న విద్యారంగ సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యిందని విద్యార్థుల జీవితాలను చిక్కుల్లో పెట్టే పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని వారు అన్నారు. అటు ప్రైవేట్ కళాశాల యజమాన్యలతో చర్చలు జరిపి కూడా విడుదల చేయవలసిన బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు, పై చదువులకు వెళ్దామంటే విద్యార్థులకు ప్రభుత్వం పైన నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ మీద ఆధారపడి చదువుకునే విద్యార్థులు అధిక సంఖ్యలో రాష్ట్రవ్యాప్తంగా ఉంటారు,అట్లాంటి విద్యార్థులకు అన్యాయం చేసే కుట్ర రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తుందని అన్నారు. అదేవిధంగా ఎస్ ఆర్ ఆర్ కళాశాలలో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ కళాశాల హాస్టల్ లను నిర్మించాలని దానిని మంజూరు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఉత్తర తెలంగాణ కేంద్రంగా ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు చదువుకుంటున్నారని వారికి సరైన హాస్టల్ వసతి లేనందువలన ప్రభుత్వ హాస్టల్లో పైన ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది కానీ హాస్టల్లో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించడంలో విఫలం అవుతున్నారు అని,విద్యార్థులకు సరిపడా సీట్ల సంఖ్యను పెంచాలని విద్యార్థిని విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం పని చేయాలని ఆకాంక్షించారు. బీసీ ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఎస్ ఆర్ ఆర్ కళాశాల విద్యార్థిగా అంచలంచలుగా ఎదిగిన ఘనత ఉద్యమ స్ఫూర్తిని కళాశాల ఇచ్చిందని అట్లాంటి కళాశాల అభివృద్ధికి మరియు హాస్టల్ అభివృద్ధికి నిర్మాణానికి శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలావస్థలలో కళాశాల ఉందని దానిని సమస్యలను పరిష్కరించి నూతన భవనాల నిర్మాణానికి పాటుపడాలని మరియు సంక్షేమ హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రాయిర్స్మెంట్ తక్షణమే విడుదల చేయవలసిందిగా వారు డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో అర్చన, శ్రీలక్ష్మి, గన్నరపు రాకేష్, రాజు, రాకేష్, రఘు, అభిలాష్, శ్రావణ్, రాజు, శీను, రజనీకాంత్, అన్వేష్, రంజిత్, చరణ్, దుర్గా, రవితేజ, సన్నీ, రంజిత్, ప్రభాకర్, విష్ణు, బద్రి తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం






**చర్చ:- కరీంనగర్. గోదావరి ఖని :**పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ లో విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, పౌరులు పొందాల్సిన సేవలు, డయల్ 100, షీ టీం, సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే నష్టాల గురించి, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వి హెచ్ ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, ఆయుధాలు భద్రపరచు రూమ్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, మోటర్ వాహనాల చట్టాల గురించి, వివిధ రకాల బందోబస్తు గురించి, సమాజంలో పోలీసుల పాత్ర, కర్తవ్యాలపై విద్యార్థులకు సమాచారం అందిస్తూ, నేర నివారణలో పోలీసుల పాత్రను వివరించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరస్తులను ఫింగర్ ప్రింట్ విధానం ద్వారా గుర్తుపట్టే టెక్నాలజీ, ఫ్రెండ్లీ పోలీసింగ్ పై అవగాహన కల్పించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు వెంటనే పోలీస్ వారికీ సమాచారం అందుంచాలని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి ఫిర్యాదు చేయాలనీ, ఏదైనా సమస్యతో వచ్చే బాధితులకు కార్పొరేట్ స్థాయిలో భరోసా, నమ్మకం కలిగే విధంగా పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి బాధితుల సమస్య తెలుసుకొని వారు చెప్పిన సమస్యను తెలుసుకొని వారిని పై అధికారులను కలిపించడం త్వరితగతికన సమస్య పరిష్కారానికి చట్టపరిధిలో చూడడం జరుగుతుంది అని అదేవిదంగా ఈ కార్యక్రమం వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు ఇంటికి వెళ్లగా తమ తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు, బంధువులకి, చుట్టుపక్కల వారికి ఏదైనా సమస్య ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయాలని పోలీసులు ఎప్పుడు ప్రజల రక్షణ కోసమే ఉన్నారని వారికీ తెలియచేయండి అని సూచించారు. చదువు ఒక్కటే విద్యార్థుల జీవితాలను మారుస్తుందని విద్యార్థిని,విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలని తెలియజేశారు.

## జనరల్ న్యూస్

# జిల్లా ఇంఛార్జి కలెక్టర్ కు రాజన్న ప్రసాదం అందజేసిన ఈఓ







**చర్చ:- కరీంనగర్. వేములవాడ :**జిల్లా ఇంఛార్జి కలెక్టర్ గా అదనపు భాద్యతలు స్వీకరించిన గరీమా అగ్రవాల్ ను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రసాదం అందజేసారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా ఇంచార్జి కలెక్టర్ ను ఈఓ మర్యాద పూర్వకంగా కలిసిశుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిని ఈఓ జిల్లా ఇంఛార్జి కలెక్టర్ కు వివరించారు.

# మిగిలి ఉన్న సీట్ల భర్తీ దరఖాస్తుల ఆహ్వానం

**చర్చ :- కరీంనగర్. సిరిసిల్ల :**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి కలెక్టరు గారి ఆదేశాలతో బాలికల పాఠశాలలైన చిన్నబోనాల, బద్దెనపల్లీ, ఇల్లంతకుంట, నర్మాల, వేములవాడ మరియు బాలుర పాఠశాలలైన బోయినపల్లి మరియు ముస్తాబాద్ లలో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణా సాంఘీక సంక్షేమ గురుకుల పాఠ శాలల జిల్లా కోఆర్డినేటర్ జే.జే తెరిస్సా, శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందిఅన్నారు. పరీక్షా రాయని విద్యార్థులకు డ్రా పద్ధతి లో సేట్లు కేటాయించ బడతాయి అన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 29.10.2025 మద్యాంం 3.00 గంటల లోపు చిన్నబోనాల గురుకుల పాఠశాల లో లేదా తమకు దగరలో ఉన్న సంక్షేమ గురుకుల పాఠశాల లోని ప్రిన్సిపాలకు అందించాలనీ, సాంఘికతేది : 30.10.2025 ఉదయం 10.00 గంటలకు చిన్నబోనాల లోని గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ / డ్రా నిర్వహించబడతాయా అన్నారు.విద్యార్థుల యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్ లు కులం, ఆదాయం,డేట్ అఫ్ బర్త్, ఆదార్ మరియు హాల్ టికెట్ (03) జిరాక్స్ సేట్లతో హాజరుకావాలని కోరారు.



మిగిలి ఉన్న సీట్ల భర్తీ దరఖాస్తుల ఆహ్వానం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి కలెక్టరు గారి ఆదేశాలతో బాలికల పాఠశాలలైన చిన్నబోనాల , బద్దెనపల్లీ, ఇల్లంతకుంట,నర్మాల, వేములవాడ మరియు బాలుర పాఠశాలలైన బోయినపల్లి మరియు ముస్తాబాద్ లలో 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణా సాంఘీక సంక్షేమ గురుకుల పాఠ శాలల జిల్లా కోఆర్డినేటర్ జే.జే తెరిస్సా,శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

TG CET పరీక్షలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందిఅన్నారు. TG CET పరీక్షా రాయని విద్యార్థులకు డ్రా పద్ధతి లో సేట్లు కేటాయించ బడతాయి అన్నారు.ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 29.10.2025 మద్యాంం 3.00 గంటల లోపు చిన్నబోనాల గురుకుల పాఠశాల లో లేదా తమకు దగరలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లోని ప్రిన్సిపాలకు అందించాలనీ, తేది : 30.10.2025 ఉదయం :10.00 గంటలకు చిన్నబోనాల లోని గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ / డ్రా నిర్వహించబడతాయా అన్నారు.

విద్యార్థుల యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్ లు కులం,ఆదాయం,డేట్ అఫ్ బర్త్,ఆదార్ మరియు TG CET హాల్ టికెట్ (Hall ticket ) (03) జిరాక్స్ సేట్లతో హాజరుకావాలని కోరారు.

District Co-ordinator
TGSWRSEIS CHINNABONALA
Mdl:& Dist:Rajanna Sircilla

# తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా లాకావత్ సురేష్ నియామకం



**చర్చ,భద్రాద్రి కొత్తగూడెం:**తెలంగాణ జాగృతి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా లాకావత్ సురేష్ ను నియమిస్తూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉత్తర్వులను జారీ చేశారు. భద్రాద్రి జిల్లాలో తెలంగాణ జాగృతి అభివృద్ధి కోసం గత 6 సంవత్సరాలుగా కృషి చేస్తున్నందుకు సురేష్ కు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్ష పదవి బాధ్యతలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో జాగృతి విద్యార్థి విభాగం బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను ఎంపిక చేసినందుకు అధ్యక్షురాలు కవిత, ప్రధాన కార్యదర్శి నవీనాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాము యాదవ్, జిల్లా అధ్యక్షుడు డి.వీరన్న కు కృతజ్ఞతలు తెలిపారు.

# జాగృతిలో మనకోండూర్ బిసి నాయకుల చేరిక



**చర్చ :- కరీంనగర్ :**ఈరోజు కరీంనగర్ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మనకోండూర్ మండల బిసి నాయకులు వంగల లింగచారి ఆద్వర్యంలో విడపు ఉగేందర్, బానాల కుమారస్వామి, వెల్ది రాజశేఖర్, వంగల కుమారస్వామి, జాగృతిలో చేరడం జరిగింది. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ వారికి జాగృతి కండువాలు కప్పి జాగృతిలోకి ఆహ్వానించారుఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా బిసిలను ఐక్యం చేయడంలో కవితక్క కీలకంగా పనిచేస్తున్నారని రెండు జాతీయ పార్టీలు బిసిలకు మోసం చేసినవే నలబై రెండు శాతం రిజర్వేషన్ అమలు చేయడం ఈ ప్రభుత్వానికి ఇష్టం లేదు బిసిలకు ఈ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలు గ్రహించారు ఈ ప్రభుత్వం బిల్లు తెచ్చింది, ఆర్డినెన్స్ ఇచ్చింది, జీవో చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులతో కోర్ట్ లో కేసులు కూడ వేయించిన విధానం ప్రజలు గమనిస్తున్నారు. ప్రభుత్వ విధానాన్ని కాంగ్రెస్ మోసన్ని తెలంగాణ జాగృతి ఊరూరా తిరిగి ప్రచారం చేస్తుందని వారు అన్నారు.బిజెపి కూడ చేసే అవకాశం వాళ్ళ చేతిలో ఉన్నప్పటికీ వాళు ్ళ కూడ బిసిలను గాలికి వదిలేశారని జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, జిల్లా నాయకులు గాలిపల్లి రత్నాకర్, అపర్ణ మంజు భార్గవి, గర్షకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు

# గుర్తింపు సంఘం కృషి ఫలితంగా ట్రాన్స్ఫర్ ఆర్డర్లకు మోక్షం

**ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ వెల్లడి**



**చర్చ, కొత్తగూడెం :**సింగరేణిలో ఉన్న ట్రాన్స్ఫర్ పాలసీని మార్చాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) పలు మార్లు యాజమాన్యం తో చర్చించి ఒప్పించి కార్మికుల వ్యక్తి గత, మ్యూచ్వల్, స్పౌస్, హెల్త్ గ్రౌండ్ ప్రాతిపదికన ఈ రోజు 114 మందికి ట్రాన్స్ఫర్ ఉత్తర్వులు ఇప్పించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. సింగరేణి లో కార్మికులు ఎవరైతే పని చేస్తున్న ప్రదేశంలో 3 సం. ల సర్వీస్ ఉండి ఖాళీ ఉన్న ప్రాంతానికి ట్రాన్స్ఫర్ కోరుకున్న వారికి, మ్యూచ్వల్ ట్రాన్స్ఫర్ పెట్టుకున్న వారికి, స్పౌస్ కేస్ లో ఖాళీలను బట్టి, అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖాళీలు ఉన్న ప్రాంతానికి ట్రాన్స్ఫర్ కోరిన వారికి శనివారం సింగరేణి యాజమాన్యం ట్రాన్స్ఫర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్ఫర్ పాలసీలో మ్యూచ్వల్ ట్రాన్స్ఫర్ కి కూడ మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధన ఉండేదని, ప్రస్తుతానికి మూచ్యువల్ట్రాన్స్ఫర్ పై 3 సంవత్స రాల నిబంధనను, స్పౌస్ కేసు ఖాళీల ప్రాతిపదికన వీటిని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ యాజమాన్యంతో మాట్లాడి ఒప్పించి, వారికి కూడా ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా డైరెక్ట్ ట్రాన్స్ఫర్స్ మూడు సంవత్సరాలు దాటిన వారికి ఖాళీల ప్రాతిపదికన వారికి కూడ ట్రాన్స్ఫర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ విదంగా ట్రాన్స్ఫర్ ఆర్డర్లు ఏఐటీయూసీ కృషి ఫలితంగా విడుదల అయినాయని ఆయన ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి యువ భారత్ శక్తి ఫౌండేషన్ అండ



**చర్చ, అశ్వారావుపేట:** వేంసూరు మండలం దిద్దుపూడి గ్రామానికి చెందిన జుంజునూరి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇటీవల కరెంటు షాక్‌కు గురై తీవ్ర గాయాలతో హైదరాబాదులోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో చికిత్స కొనసాగించలేకపోతున్న విషయం తెలుసుకున్న యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులు దాతల సహకారంతో రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వయంగా తమ చేతుల మీదుగా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ సమాజంలో ఒకరికి ఒకరు అండగా నిలబడే భావన మనందరిలో పెరగాలన్నారు.

ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు ప్రేరణ కావాలన్నారు. ఆపదలో ఉన్న జుంజునూరి వెంకటేశ్వరరావు కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన దాతలకు, యువ భారత్ శక్తి ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ భారత్ శక్తి ఫౌండేషన్ ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేట పోలీసుల కార్డెన్ సెర్చ్





**చర్చ, అశ్వారావుపేట:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు 'చైతన్యం%-% డ్రగ్స్ పై యుద్ధం' కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి చైతన్యం కల్పించే ఉద్దేశంతో శనివారం అశ్వారావుపేట మున్సిపాలిటీలోని వడ్డెర బజార్ కాలనీ వద్ద నాకాబంది, కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 70 మోటార్ సైకిళ్లు, 4 ఆటోలు, 4 కార్లు, ఆరు ట్రాక్టర్లు, రెండు లారీలు, బెల్టు షాపులను సోదా చేసి సుమారు 16 లీటర్ల మద్యంను స్వాధీనపరచుకున్నారు. డ్రగ్స్ వలన కలిగే అనర్థాల గురించి కాలనీవాసులకు వివరించి చైతన్య పరిచారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ పి.నాగరాజు, ఎస్.ఐలు యయాతిరాజు, రామ్మూర్తి, అఖిల దమ్మపేట ఎస్.ఐ సాయి కిషోర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా నాగులచవితి వేడుకలు





**చర్చ, అశ్వారావుపేట:** నియోజకవర్గ వ్యాప్తంగా నాగులచవితి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. నాగులచవితి పర్వదినం సందర్భంగా అశ్వారావుపేట పట్టణం, పరిసర ప్రాంతాల భక్తులు భక్తి శ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. శైవ క్షేత్రాల్లోని నాగేంద్ర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించగా, ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే భక్తులు పాలు, గుడ్లు, తేనె, గంధం, కుంకుమలతో నాగదేవతకు అభిషేకాలు పూజలు చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొని కుటుంబ సౌఖ్యం, సంతానం, పంటలాభం కోసం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు పూలతో అలంకరించగా, భక్తులు అక్కడి వాతావరణాన్ని ఆధ్యాత్మికంగా మార్చారు. పండుగ కారణంగా పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

## ఉద్యాన విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ భాగస్వామ్య సదస్సు



**చర్చ, అశ్వారావుపేట:** మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో శనివారం కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన కళాశాల, మోజెర్ల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సును నిర్వహించారు. రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఈ సదస్సును చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యాన విద్యార్థులు వివిధ రకాల ఆకృతులలో గ్రామానికి సంబంధించిన పూర్తి వివరాలను రైతులకు వివరించారు. గ్రామంలోని జనాభా లెక్కలు, కాల క్రమం, పంటల ప్రాధాన్యత, కదలిక పటం, నేలల రకాలు, గ్రామ పటం వంటి అనేక అంశాల గురించి గ్రామస్తులకు వివరంగా తెలియజేశారు. విద్యార్థులు గ్రామ వ్యవసాయ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయడంలో భాగంగా నిర్వహించిన ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడిందని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం, అశ్వారావుపేట రిసెర్చ్ అసోసియేట్ వి.మౌనిక, విద్యార్థులు కృష్ణ నాయక్, వంశీ, నాగేష్, ధర్మతేజ, సురేంద్ర, రైతులు దుర్గయ్య, రవికుమార్, సీతారాములు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. ?

# నూతన వధూవరులను ఆశీర్వదించిన తాటి



**చర్చ, అశ్వారావుపేట:** దమ్మపేట మండలం అంకం పాలెం గ్రామంలో కాక శ్రీనివాసరావు, వరలక్ష్మి దంపతుల కుమార్తె లయ, రవి కుమార్‌ల వివాహ రిసెప్షన్ వేడుకలో బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని నూతన వధూవరులకు నూతన వస్త్రాలను అందజేసి వారిని ఆశీర్వాదించి నిండు నూరేళ్ళు సుఖ సంతోషాలతో కలిసిమెలసి జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సోయం నాగేశ్వరరావు, సోయం చిన్నారి, తాటి చంద్రం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థుల బకాయిలు ఏవి

- ప్రజాపాలనలో విద్యార్థుల చదువులకు నిధులు లేవా
- కమిషన్ల కోసమే ఫీజు బకాయిలు పెండింగ్
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



**చర్చ :- కరీంనగర్ :**తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు ఎందుకు విడుదల చేయడం లేదని? విద్యాశాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యార్థులకు ఉపయోగం లేదని, కమిషన్ల కోసమే ఫీజు బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల చదువులతో ప్రభుత్వం చెలగాట మాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యారంగాన్ని ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందని, ప్రజా పాలన అంటే విద్యార్థులకు వారి చదువులకు నిధులు విడుదల చేయరా అని,

, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిరక్ష్యం చేయడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు తరచూ బంద్ చేస్తే విద్యార్థులు చదువులకు దూరమైన ప్రభుత్వం లో చలనం లేకపోవడం సిగ్గు చేటని,అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినమాట తప్పారని, విద్యార్థులకు ఓట్లు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఓట్లు ఉన్నాయనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకొని నవంబర్ 1వ తేదీ లోపు మొత్తం ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, మంత్రులను తిరగనివ్వమని విద్యార్థులతో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి ప్రకటనలో హెచ్చరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని,సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని,గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు 8వేల కోట్లు పూర్తిగా పెండింగ్ లో ఉన్నాయని,ఫీజు బకాయిలు విడుదల లేక విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు,సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఫీజు బకాయిల విడుదల పై మాట తప్పారని, అసెంబ్లీ సాక్షిగా నెలకు 500 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మోసం చేశారని, ఫీజు బకాయిల విడుదల లేక డిగ్రీ,ఇంజనీరింగ్ ఇతర కోర్సులు పూర్తి అయిన విద్యార్థులు డబ్బులు కట్టి మరి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని, ఇప్పుడు ఇంజనీరింగ్,డిగ్రీ,పీజీ కళాశాలలు మళ్ళీ నవంబర్ 3 నుండి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు నిరవధిక బంద్ చేస్తామని ప్రకటించాయని, ఇప్పటికే మూడు సార్లు బంద్ నిర్వహించారని దీంతో విద్యార్థులు తరగతులు వెనుకబడుతున్నారని, ఇప్పుడిప్పుడే ఇంజనీరింగ్,డిగ్రీ కళాశాలల్లో తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని ఇంజినీరింగ్,డిగ్రీ కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న మరియు టోకెన్లు మంజూరు అయిన ఫీజు బకాయిలను విడుదల చేయడం ద్వారా ప్రభుత్వం పై భారం తగ్గుతుందని, వెంటనే ప్రభుత్వం కళాశాలల యాజమాన్యాలతో చర్చించి విద్యార్థుల తరగతులకు ఇబ్బందులు లేకుండా బంద్ విరమించేలా , పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు

# అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి








**చర్చ, అశ్వారావుపేట:** అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసేలా రైతులకు సహాయ సహకారాలు అందించాలని కృషి వాస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ నరసింహారెడ్డి అన్నారు. దమ్మపేట మండల పరిధిలోని మల్లారం రైతువేదిక నందు రైతులకు కృషి వాస్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ విష్ణు అర్జున్ రెడ్డి ఆధ్వర్యంలో సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగు చేయు పంటలలో చీడపీడలను మన కంటికి కనిపించక ముందే శాటిలైట్ ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. ఈ కృషి వాస్ ప్రాసెస్ యాప్ ద్వారా రైతుల పొలాల్లో సమస్యలను వెంటనే గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేయడం వలన దానికి సంబంధించిన నివారణ చర్యలను కూడా ఆ యాప్ ద్వారా సూచించడం జరుగుతుందన్నారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా పామాయిల్ సాగులో రైతులకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని, కావున రైతులు దీన్ని సద్వియం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్ర రావు, డివిజన్ అధికారి రవికుమార్, మండల వ్యవసాయ అధికారి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు కేశవరావు, యం.దీప్తి, అనుబాబు, వినోద్, రైతులు, పామాయిల్ రైతులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెలో గులాబీ జెండా ఎగురవేయాలి



**చర్చ, అశ్వారావుపేట:** భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశానుసారం దమ్మపేట మండల కేంద్రంలో మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ పార్టీ జెండాను ఎగురవేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు, జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరావు ఆదేశాలతో దమ్మపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి గులాబీ జెండాను ఎగురవేసినట్లు దొడ్డా రమేష్ తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తంచేశారు. 6 గ్యారంటీలతో 420 హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఖచ్చితంగా గుణపాఠం చెబుతారరన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు రావు జోగేశ్వరావు, మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జున రావు, నియోజకవర్గ నాయకులు సోయ్యం విరభద్రం, మండల నాయకులు అంకత ఉమ మహేశ్వరావు, జలగం వాసు, ఊప సర్పంచ్ దారా యుగంధర్, నాయక్‌పోడు సంఘం జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు, తుమ్మల లక్ష్మణరావు, మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన ఏసుబాబు, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు, యూత్ మండల అధ్యక్షులు మండవ సత్యానారాయణ, మాజీ ఎంపీటీసీలు దేవరపల్లి అజయ్ కుమార్, కాసిని శ్రీను, మాజీ సర్పంచ్ ఉయ్యాల చిన వెంకటేశ్వరావు, రెడ్డిమళ్ళ నాగయ్య, అబ్దుల్ జిన్న, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం సింగరేణి కార్పొరేట్ లైసెన్ ఆఫీసర్ గా నియమితులైన డాక్టర్ మాలతి కి నియామక పత్రం అందజేసిన సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్



**సింగరేణి కొత్తగూడెం, 25 అక్టోబర్ చర్చ బ్యూరో :**నూతనంగా కార్పొరేట్ ఏరియా హెడ్ ఆఫీస్ లైసెన్ ఆఫీసర్గా నియమితులైన డాక్టర్ మాలతి కొమ్ము నీ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ మెయిన్ హాస్పిటల్ చేతుల మీదుగా లైసెన్ ఆఫీసర్ నియామక పత్రం అందచేయడం జరిగినది. తదానంతరం అంతోటి నాగేశ్వరరావు జనరల్ సెక్రెటరీ సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ మాలతి కి పూల బొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగినది. సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంగం విజ్ఞప్తి మేరకు ఎన్. బలరాం నాయక్ ఐఆర్ఎస్ సి అండ్ ఎండి, గౌతమ్ పొట్రు ఐఏఎస్ డైరెక్టర్ పా, జిఎం పర్సనల్ కవిత నాయుడు డాక్టర్ మాలతి తో సహా ఏడుగురి ఎస్సీ లైసెన్ ఆఫీసర్లను సింగరేణి వ్యాప్తంగా నియమించడం జరిగినది. సింగరేణిలో మొట్టమొదటిసారిగా ఒక ఎస్సీ మహిళను కార్పొరేట్ ఏరియా లైసెన్ ఆఫీసర్ గా నియమించడం చాలా సంతోషంగా ఉన్నది అలాగే డాక్టర్ మాలతి తండ్రిగారైన కొమ్ము రంగస్వామి, ఏజీఎం ఐఈడీ రిటైర్డ్ సింగరేణి చీఫ్ లైసెన్ ఆఫీసర్గా పనిచేసి పదవీ విరమణ పొందినారు, వారి యొక్క సేవలను గుర్తించి డాక్టర్ మాలతి మేడం ని కార్పొరేట్ ఏరియా లైసెన్ ఆఫీసర్గా నియమించడం జరిగినది, ఈ యొక్క కార్యక్రమంలో మేకల కనకయ్య జిఎం ఆర్ అండ్ డి, కె.రాజీవ్ కుమార్ మెయిన్ వర్క్ షాప్, డాక్టర్ సునీల, డిప్యూటీ సి ఎం ఓ, డాక్టర్ వినూత్న ,డాక్టర్ కృష్ణమూర్తి, కె.హతి రామ్ కార్పొరేట్ ఏరియా ఎస్టేలైజర్ ఆఫీసర్, కలవల చంద్రశేఖర్ డిప్యూటీ జిఎం కొత్తగూడెం ఏరియా లైసెన్ ఆఫీసర్ , జిమ్మిడి మల్లేష్ ట్రెజరర్ సెంట్రల్ కమిటీ, ఎం.చంద్రమౌళి డివైజియం ఎక్స్ప్లోరేషన్ కార్పొరేట్ , పొనుగంటి అంకుష్ సెంట్రల్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మొగిలిపాక రవి కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కమిటీ సభ్యుడు చెరిపెల్లి నాగరాజు, కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కమిటీ సభ్యుడు, ఉర్సు సుదర్శన్ ఆర్ సి హెచ్ పి పిట్ కమిటీ సెక్రటరీ, డాక్టర్ శ్యామల చిల్డ్రన్ స్పెషలిస్ట్, మరియు బీసీ నాయకులు సకినాల సమ్మయ్య కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బీసీ సంఘం, బూర్గుల రామారావు వైస్ ప్రెసిడెంట్ ఇల్లందు ఏరియా, మరియు బిసి నాయకులు వంగపండ్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
అక్టోబర్ 26, 2025



# క్యాంపస్ రిక్రూట్మెంట్‌లో కొలువులు సాధించిన సాయిస్ఫూర్తి విద్యార్థులు

- ఎంపికైన 40 మందిని అభినందించిన ౦ కళాశాల యాజమాన్యం



**చర్చ, సత్తుపల్లి:** సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈ ఈఈ), మెకానికల్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 92 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ట్రైనింగ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ ఇంటర్వ్యూలను రెనాల్ట్ నిస్సాన్ కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ యం.ప్రకాష్ ఆధ్వర్యంలో చేపట్టగా ప్రీ ప్లేస్మెంట్ టాక్, రాతపరీక్ష, టెక్నికల్ హెచ్ఆర్, మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా 40 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజనీర్, ప్రొడక్షన్ ట్రైనీ ఇంజినీర్లుగా వివిధ కేటగిరిల్లో ఈసిఈ విభాగం నుంచి 33మంది, ఈఈఈ విభాగం నుంచి 6మంది, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి ఒకరు చొప్పున 40మంది ఉద్యోగాలు సాధించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి జాతీయస్థాయి ఇంటర్వ్యూల ద్వారా మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజనీర్, డిజైన్ ఇంజినీర్లుగా కొలువులు సాధిస్తున్న పరంపరలో మరో అద్భుత అవకాశం అందిపుచ్చుకున్న కళాశాల విద్యార్థులను అభినందించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థినీ, విద్యార్థులకు అభినందనలు తెలియజేసారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ యాకూబ్, కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఈసి ఈ, ఈఈఈ విభాగాధిపతులు డాక్టర్ పాముల శేఖర్‌బాబు, కె. రామకృష్ణప్రసాద్ , మెకానికల్ విభాగాధిపతి వి.వెంకట రామి రెడ్డి, అన్నీ ఇంజనీరింగ్ బ్రాంచీల విభాగాధిపతులు ఉన్నారు.

# అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో 100% మా ప్యానలే గెలుస్తుంది

- మా అభ్యర్థులంతా మంచి అనుభవం..ఆలోచన.. ఆశయం కలవారు..
- మా ప్యానల్ ను మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీర్వదించారు..
- అర్బన్ బ్యాంకులో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తాం..
- బ్యాంకు డిపాజిట్లను మూడింతలు పెంచుతాం..
- నాలుగు కొత్త బ్రాంచ్ లను ఏర్పాటు చేస్తాం..
- ప్రగతి పథంలో పయనించేలా చూస్తాం..
- అద్భుతమైన మేనిఫెస్టో రూపొందిస్తాం..
- డిపాజిట్ దారులకు నమ్మకంగా వ్యవహరిస్తాం.. వారి భద్రతకు పెద్దపీట వేస్తాం..
- అర్బన్ బ్యాంకుకు మంచి పేరు వచ్చేలా చూస్తాం.
- ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందిస్తాం..
- సత్వరమే పనులు జరిగేలా చూస్తాం..
- గెలిచిన తర్వాత పాలకవర్గం నీతిమంతంగా సేవలందిస్తుంది..
- అర్బన్ బ్యాంకు ఖాతాదారులు, సభ్యులు మా ప్యానల్ ను ఆదరించాలి..
- గతంలో అనేక ఆరోపణల్లో కురుకుపోయిన వారే మళ్లీ పోటీ చేస్తున్నారు..
- మా ప్యానల్ అభ్యర్థుల వ్యక్తిత్వం చూసి ఓటెయ్యండి..
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు..
- అర్బన్ బ్యాంక్ ప్యానల్ అభ్యర్థులతో కలిసి వెలిచాల ప్రెస్ మీట్..
- ప్యానల్ ప్రకటన..





**చర్చ :- కరీంనగర్ :** కరీంనగర్ జగిత్యాల అర్బన్ బ్యాంకు ఖాతాదారులు సభ్యుల సహకారంతో 100% తమ ప్యానల్ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. తమ ప్యానెల్ అభ్యర్థులు మంచి అనుభవం మంచి ఆశయం ఆలోచన కలిగిన వారు అని పేర్కొన్నారు. విజయం సాధించిన తర్వాత అర్బన్ బ్యాంకును అద్భుతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన నీతిమంతమైన పాలన అందిస్తామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం వెలిచాల ప్రజా కార్యాలయంలో అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులతో కలిసి వెలిచాల రాజేందర్ రావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజేందర్ రావు తమ ప్యానల్ అభ్యర్థులను ప్రకటించారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధికి చేపట్టే ప్రణాళిక.. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారే మళ్లీ వారే అధికారం కోసం తాపత్రయపడుతున్న అంశంతో పాటు పలు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వెల్చాల రాజేంద్రరావు మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా కరీంనగర్ అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు జరగలేదన్నారు. బ్యాంకుకు సంబంధించిన వివిధ అలిగేషన్లు ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఒకరిపై ఒకరు ఈ విషయంలో దుమ్మెత్తి పోసుకున్నారని చెప్పారు. కోర్టులో కేసులు నడవడం వల్ల ఎన్నికలకు జాప్యం జరిగిందన్నారు. తిరిగి మళ్లీ కోర్టు ఆదేశాల ప్రకారం ఎన్నికలు జరుగుతున్నాయని వివరించారు. తమ ప్యానల్ అభ్యర్థులు గెలిచిన తర్వాత అర్బన్ బ్యాంకు ను పూర్తిస్థాయిలో సంస్కరిస్తామని స్పష్టం చేశారు. ఖాతాదారులు సభ్యులకూ భద్రత కల్పిస్తామని వారి సొమ్ముకు ఎలాంటి డోకా లేకుండా సేవలందిస్తామని తెలిపారు. ప్రస్తుతం అర్బన్ బ్యాంకులో 92 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని తమ ప్యానల్ గెలిస్తే ఈ డిపాజిట్లను మూడింతలుగా అయ్యేలా చేస్తామన్నారు. అదేవిధంగా నాలుగు కొత్త బ్రాంచ్ ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. హుస్నాబాద్ చొప్పదండి హుజురాబాద్ జమ్మికుంటలో కొత్త బ్రాంచ్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఖాతాదారులకు నిజాయితీగా సేవలందించేందుకు తమ ప్యానల్ అభ్యర్థులు కృషి చేస్తారని రాజేంద్రరావు పేర్కొన్నారు. ఇతర బ్యాంకుల కంటే అర్బన్ బ్యాంకుకు మంచి పేరు తీసుకొస్తామని ఖాతాదారులకు త్వర త్వరగా సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరగా రుణాలు ఇవ్వడం డిపాజిట్లు సేకరించడం.. బ్యాంకు ను డిజిటలైజ్డ్ చేయడంతో పాటు ఖాతాదారులను చేర్పించడంతో పాటు మొత్తానికి అర్బన్ బ్యాంకును పూర్తిస్థాయిలో సంస్కరిస్తామని తెలిపారు.. కాంగ్రెస్ వ్యక్తిత్వము భావజాలం కలిగిన వారు కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉన్నవాళ్లందరూ ముందుకొచ్చారనీ, వారందరిని కలిపి ఒక ప్యానెల్ గా ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో మొదటి నుంచి ముడిపడి ఉన్న వ్యక్తులు ఉన్నారు కాబట్టి వారి వెంట ఉండి గెలిపించే బాధ్యత తాను తీసుకున్నానని రాజేందర్ రావు స్పష్టం చేశారు. మా ప్యానల్ గెలిస్తే అర్బన్ బ్యాంకు అభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో ఖాతాదారులకు సభ్యులకు భరోసా కల్పించేందుకు అద్భుతమైన మేనిఫెస్టోను రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్యానల్ ఎంపికలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం ఉండే విధంగా చూశామని మహిళలు, ఎస్సీలు బీసీలు ఇతర వర్గాలకు పెద్దపీట వేశామని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలు అర్బన్ బ్యాంకు ఓటర్లు తమ తమ ప్యానెల్ ను కచ్చితంగా గెలిపిస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు. ఖాతాదారులను ఓటర్లను స్వయంగా కలిసి ఓటును అభ్యర్థించి మంచి మెజార్టీతో అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు బిజెపి బీఆర్ఎస్ పార్టీలో నుంచి వచ్చి ఒక ప్యానెల్గా ఏర్పాటు చేసుకొని ఓటర్ల ముందుకు వస్తున్నారని తెలిపారు. తమ ప్యానల్ లో ఉన్న వారి వ్యక్తిత్వము అనుభవము ఆలోచన తీరు అన్ని ఆలోచించి ఓటర్లు తమకు పట్టం కడతారని రాజేందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. గతంలో పనిచేసిన వారి తీరు బేరీజు వేసుకొని ఓటర్లు ఆలోచన చేయాలని సూచించారు. తమ ప్యానెల్ కు అవకాశం ఇస్తే బ్యాంకును తెలంగాణ రాష్ట్రంలోనే మోడల్గా తీర్చిదిద్దుతామని రాజేంద్రరావు స్పష్టం చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆ నియోజకవర్గ నుంచి మంచి ఆశయం పట్టుదల ఉన్న ఇద్దరిని తమ ప్యానెల్ కు ప్రతిపాదించారని ఇందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. తమ ప్యానెల్ కు రోజురోజుకు మద్దతు పెరుగుతుందని ఓటర్లు తమకు ఓటు వేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని రాజేందర్ రావు తెలిపారు. ప్యానెల్ కు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు విప్ ఆది శ్రీనివాస్ ఆశీర్వాదం.. ఆశీస్సులుశనివారం ఉదయం తన ఆధ్వర్యంలో హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో కరీంనగర్ అర్బన్ బ్యాంకు ప్యానల్ డైరెక్టర్లు మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశామని వెలిచాల రాజేంద్రరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్యానెల్ డైరెక్టర్లను మంత్రులు, విప్ కు రాజేందర్ రావు పరిచయం చేశానని చెప్పారు. పానల్ డైరెక్టర్లకు మంత్రులు విప్ ప్రత్యేక ఆశీర్వాదం.. ఆశీస్సులు అందజేశారని తెలిపారు. అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో అభ్యర్థులంతా గెలిచి రావాలని సూచించారని చెప్పారు. గెలిచి వచ్చి అర్బన్ బ్యాంకు ను మరింత అభివృద్ధి చేసుకోవాలని తమకు సూచించారని రాజేందర్ రావు పేర్కొన్నారు. మీ అందరికీ అండగా మేముంటామని మంత్రులు భరోసా కల్పించారని తెలిపారు. తమ ప్యానెల్ కు మంత్రులు విప్ అండగా ఉంటామని ఆశీర్వదించడం ఎంతో బలాన్ని ఇచ్చిందని రాజేందర్ రావు పేర్కొన్నారు. కచ్చితంగా గెలిచి వస్తామని వారికి గంట పదంగా చెప్పామని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో రాజేందర్ రావ్ మద్దతిస్తున్న అర్బన్ బ్యాంకు ప్యానెల్ అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఈ.లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, గాదె కార్తీక్, కూసరి అనిల్ కుమార్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాగులమ్మ జాతరలో పినపాక ఎమ్మెల్యే పాయం





**చర్చ, అశ్వాపురం:** మండల పరిధిలోని గొందిగూడెం, కొత్తూరు, సంద్రలబోడు, బండ్ల సిరిగుట్ట నందు నిర్వహించిన ఆదివాసీల ఇలవేల్పు శ్రీ నాగులమ్మ జాతరలో శనివారం పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాయం మాట్లాడుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అర్చన, అభిషేకాల కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించిన కమిటీ సభ్యులకు ధన్యావాదాలు తెలిపారు. పినపాక నియోజకవర్గ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నాగులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించినట్లు చెప్పారు. అనంతరం సంద్రల బోడు గ్రామంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చుంచు ఏకాంబరం, ఎండీ షర్ఫుద్దీన్, ఏనిక రవి బాబు, తెల్లం వీరభద్రం, కాకా రాములు, పాయం భద్రమ్మ, సోడే వెంకటేశ్వర్లు, సోడే భిక్షం, రావులపల్లి నరసింహారావు, కొమరం చిట్టెమ్మ, గొల్లపల్లి నరేష్, బెజ్జంకి వెంకటాచారి, వేముల విజయ్, కోలా శశికాంత్, ఎస్కే. షారుక్ పాషా, తెల్లం నాగరాజు, గుర్రం తిరుపతి రావు, కోండ్రు నాగేశ్వరరావు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ చైతన్య సదస్సు






**చర్చ, సత్తుపల్లి:** స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సత్తుపల్లి జడ్జి యం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కోర్టులు ఎన్ని రకాలుగా ఉంటాయి, ఏ కోర్ట్ లో ఏయే కేసులు వాదిస్తారో వివరంగా తెలియజేశారు. అలాగే ప్రామిసరీ నోట్ ఏవిధంగా రాయాలి, అది ఎంత కాలం వరకు చెల్లుబాటు అవుతుంది, ప్రామిసరి నోట్ మీద కేసుకు సంబంధించి కోర్టుకు ఏవిధంగా వెళ్లాలో తెలియజేశారు. సివిల్ కేసులంటే ఏమిటి, క్రిమినల్ కేసులంటే ఏమిటి, బెయిలబుల్ కేసులు, నాన్ బెయిలబుల్ కేసుల గురించి వివరించారు. ఆడపిల్లలు సమాజంలో ఏవిధంగా నడుచుకోవాలో తెలియజేశారు. ఈ సదస్సు సందర్భంగా బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కోర్టులకు సంబంధించి, కేసులకు సంబంధించి చాల విషయాలు విద్యార్థులకు తెలియజేసినందుకు సత్తుపల్లి జడ్జికి ధన్యవాదాలు తెలియజేసి, జడ్జిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మి, లలితమ్మ, ప్రమీల, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, రామారావు, రాణి, శ్వేత, సమ్మక్క, శిరోమణి, వెంకటేశ్వరరావు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## కుంచపర్తి లో మురుగు నీటితో రోగాల బారిన పడ్డ కుటుంబం


- ప్రజల ప్రాణాలు పోతున్నా పారిశుధ్య పనులు సున్న






**చర్చ, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని కుంచపర్తి గ్రామంలో ఒక కుటుంబం వారు స్నానం చేసిన మురుగు నీరు ఇంకుడు గుంత నిర్మించకుండా బయటకు రోడ్డు మీద కు వదలడం వల్ల అదే గ్రామంలో నివసించే పక్క ఇంటి ఓ చిరువ్యాపారి వనమా శ్రీను,రమాదేవి కుటుంబం పారిశుధ్యం పడకేసి గత సంవత్సరం కాలంగా రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం బ్లెడ్,యూరిన్ ఇన్ఫెక్షన్ లు సంభవించి మండల కేంద్రంలోని ఆరోగ్య మాతా ఆసుపత్రి లో చికిత్స తీసుకొని తిరిగి ఇంటికి వచ్చాక కూడా అదే మురుగు నీటి దుర్గంధంతో జీవించడం వల్ల వ్యాధి తగ్గు ముఖం పట్టడం లేదు. ఇట్టి విషయమై స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి కి పలుమార్లు విజ్ఞప్తి చేసినా చూస్తాం చేస్తాం అంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు.ఇటీవల అట్టి విషయమై ఎంపీడీఓ పరిమి రాజారావు మురికి నీరు పరిశీలన చేసి సంబంధిత కుటుంబం వారికి నోటీసు జారీ చేయించినా ఖాతరు చేయడం లేదని వినికిడి.మరి చట్ట ప్రకారం విద్యుత్ కటింగ్,నీటి కుళాయి కటింగ్ చేయాల్సి ఉన్నా చేయక పోవడం వెనుక దాగి ఉన్న ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.చిరు వ్యాపారి కుటుంబం ప్రాణాలు పోయినా పట్టదా ?అని మీడియా ఎదుట శనివారం వారు ఆవేదన వ్యక్తం చేశారు.

## కలుపుమందు తాగిన ఘటనలో తల్లి పఠాన్ సల్మా మృతి



**చర్చ, సత్తుపల్లి:** పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన పఠాన్ సల్మా(28), భర్త సలీమ్ మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం సల్మా తన ఇద్దరు కుమారులు నసీమ్, నయన్‌లకు కలుపు మందు తాగించి అనంతరం తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితులను తొలుత సత్తుపల్లి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ తరలించగా శనివారం సల్మా తుదిశ్వాస విడిచింది. పెద్ద కుమారుడికి థమ్సప్‌తో కలుపుమందు కలిపి ఇవ్వడంతో తక్కవ మోతాదులో తాగడం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. చిన్న కుమారుడు ఎక్కువగా తాగడం వల్ల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సల్మా భర్త సలీమ్ పట్టణంలోని ఓ ఆటో కంపెనీలో పని చేస్తుండగా, సల్మా ప్రైవేట్ జాబ్ చేసేదని సమాచారం. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చింతిర్యాల రహదారికి మోక్షం కలిగించండి



**చర్చ, అశ్వాపురం:** చింతిర్యాల రోడ్డుకి ఇకనైనా మోక్షం కలిగించాలని బీఆర్ఎస్ పినపాక నియోజకవ్రగ ఎస్సీసెల్ అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం చింతిర్యాల రోడ్డుపై పడిన గుంతలను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న చింతిర్యాల రోడ్డుకి మోక్షం కలగటం లేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్నోసార్లు ఈ గ్రామ పర్యటనకు వస్తున్నారు కానీ రోడ్డును చూసి కనికరించడం లేదని ఆరోపించారు. ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే మూడు పంచాయితీల ప్రజలు ఎంతో నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు, రోగులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నారన్నారు. కనీసం ఆటో వాళ్ళు కూడా ఈ రోడ్డుకు రావాలంటే భయపడి రావటం లేదన్నారు. ఇకనైనా పాలకపక్షం, జిల్లా ఉన్నత అధికారులు ఈ రోడ్డును తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని, లేనిపక్షంలో గ్రామస్తులను అందరినీ కలుపుకొని భారీ ఎత్తున ధర్నా చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు కుప్పిలి సామంత్, నిమ్మల సునీల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు 'చైతన్యం'




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు "చైతన్యం డ్రగ్స్‌పై యుద్ధం" కార్యక్రమంలో భాగంగా శనివారం రామవరం సమీపంలోని ఏకలవ్య మోడల్ స్కూల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టూ టౌన్ సీఐ ప్రతాప్ హాజరై విద్యార్థులకు మత్తు పదార్థాలు, వాటి వినియోగం వల్ల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మనీషా , ఎఎస్ఐ ఝాన్సీ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకాశం స్టేడియంను శుభ్రం చేసిన సింగరేణి, కార్పొరేషన్ సిబ్బంది





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** చెత్తా చెదారంతో నిండి అధ్వానంగా మారిన కొత్తగూడెం పట్టణంలోని ప్రకాశం స్టేడియంను ఒకవైపు సింగరేణి పారిశుధ్య సిబ్బంది, మరోవైపు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది శనివారం తొలగించారు. 'డంపింగ్ యార్డును తలపిస్తున్న ప్రకాశం స్టేడియం' అనే శీర్షికతో శనివారం 'చర్చ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సింగరేణి, కార్పొరేషన్ శాఖ అధికారులు స్పందించారు. వర్షం కురవడం వల్ల చెత్తచెదారం, అట్ట పెట్టెలు మట్టిలోకి కూరుకుపోయాయని పారిశుధ్య సిబ్బంది తెలిపారు. సింగరేణి అధికారులు స్పందించి మరో మారు జెసిబి ఏర్పాటు చేసి గ్రౌండ్‌ను క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా శుభ్రం చేయిస్తే బాగుంటుందని క్రీడాకారులు కోరారు. అంతేకాకుండా ప్రకాశం స్టేడియంలో బహిరంగ సభలు, స్టాల్స్ ఏర్పాటు చేసినప్పుడు గ్రౌండ్‌ను శుభ్రం చేయించే బాధ్యత కూడా నిర్వాహకులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు. ప్రకాశం స్టేడియంలో తాము ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినందుకు వాకర్స్, క్రీడాకారులు 'చర్చ'కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్ఎస్ఎస్ అజెండాను జాతిపై బలవంతంగా రుద్దుతున్న బీజేపీ


- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాచర్ల భారతి



**చర్చ, సత్తుపల్లి:** ఆర్ఎస్ఎస్ అజెండాను జాతిపై బీజేపీ బలవంతంగా రుద్దుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి ఆరోపించారు. స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో శనివారం పాకలపాటి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాచర్ల భారతి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ విధానాలను బలపరుస్తూ దేశానికి ఆర్ఎస్ఎస్ ఎన్జీవో అని వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. ఒకపక్క పార్లమెంట్లో ఓట్ల తొలగింపుపై చర్చ జరుగుతుంటే బిహార్‌లో సుమారుగా 65 లక్షల ఓట్లు తొలగింపును పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. ముస్లిం ఓట్లను సైతం తొలగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐలను పావులుగా వాడుకుంటూ రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రలని తక్షణమే ప్రారంభించాలని, తక్షణమే ఓటరు సవరణ కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతులపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు, చావా రమేష్, వలీ, భాస్కర్, ఝాన్సీ రత్నకుమారి, రాము, భాస్కర్, సైదా తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





**చర్చ, మణుగూరు:** కారులో వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, అదుపుతప్పి చెట్టును కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మణుగూరు మండలం బీటీపీఎస్‌కు చెందిన విశ్రాంత కార్మికుడు సందు పట్ల కృష్ణారెడ్డి శనివారం పాల్వంచలో సెకెండ్ హ్యాండ్ కారు కొనుగోలుచేసుకుని తిరిగి మణుగూరు వస్తున్నాడు. ఈ క్రమంలో తోగ్గూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి తరువాత కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, ద్విచక్రవాహనదారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు మార్చురీలో కృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి బంధువులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్టు

**చర్చ, కొత్తగూడెం క్రైం:** చేతబడి చేశాడనే నెపంతో వ్యక్తిని హత్యచేసిన ఘటనలో నిందితుడిని చుంచుపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ రహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయితీకి చెందిన పొడియం రాము అనే వ్యక్తి కుమారుడు అనారోగ్య కారణాలతో చనిపోయాడు. అయితే పద్దం నందయ్య అనే వ్యక్తి చేతబడి చేయడం వల్లనే తన కుమారుడు చనిపోయాడని కక్ష పెంచుకున్న రాము అతని మిత్రులు తాపర్ల వెంకటేష్, అనిల్, ఉంగయ్యలతో కలిసి ఇటీవల నందయ్యను కర్రలు, గొడ్డలితో నరికి చంపి, తరువాత మృతదేహాన్ని స్థానిక తెల్లవాగులో పడేవారు. మృతుడి బంధువు పద్దం గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుల్లో ఒకడైన తాపర్ల వెంకటేష్‌ను అరెస్టు చేయడంతోపాటు అతని వద్ద నుంచి ఒక గొడ్డలి, మూడు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రెహమాన్ వివరించారు.

# ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

- 'అబ్దుల్ కలాం' ఫ్రెషర్స్‌డేలో కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రతి ఒక్క విద్యార్థి ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చునని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డలోగల అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ దోసపాటి వెంకటేశ్వర రావు, సెక్రెటరీ, కరెస్పాండెంట్ చావా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, సాఫ్ట్‌వేర్ రంగంలో కొత్తకొత్త టెక్నాలజీలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకుంటే ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని హితవుపలికారు. నూతన విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. దేశం అభివృద్ధి చెందాలంటే సైంటిస్టులు, రైతుల పాత్ర ఎంతగానో ఉందని, విద్యార్థులు ఆ వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సివిల్స్‌లో రాణించాలనుకునే విద్యార్థులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా, ప్రత్యేక తరగతులు చెప్పేందుకు సైతం తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రూప్ వన్ ఆఫీసర్ భానోత్ పృధ్వి మాట్లాడుతూ బీటెక్ విద్యను అభ్యసించేవారు ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఎన్‌పిటిఈఎల్, స్వయం కోర్స్ ఉద్యోగ అవకాశాలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దయాకర్, రమేష్, శ్రీకాంత్, సైదయ్య ,బాబురావు, లక్‌పతి, హెచ్ఓడిలు మునీర్, రవికిరణ్, కృష్ణమోహన్, వినోద్, వెంకటేశ్వరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా నిందితుడు శివశంకర్ రెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు



**చర్చ,జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా కేసులలో నిందితుడిగా ఉన్న దుగ్గెంపూడి శివశంకర్ రెడ్డి అనే వ్యక్తిపై జూలూరుపాడు పోలీసులు పీడీ యాక్ట్‌ను నమోదు చేశారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఆదేశాల మేరకు, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ సలహాలతో జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి తగిన పత్రాలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించారు.శివశంకర్ రెడ్డి బూర్గంపాడు మండలం సారపాక, తాళ్లగొమ్మూరు ప్రాంతాలకు చెందినవాడు. అక్రమార్జనే లక్ష్యంగా నిషేధిత గంజాయిని తరచుగా రవాణా చేస్తూ, బూర్గంపాడు, జూలూరుపాడు, అలాగే హైదరాబాద్ బాలనగర్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఎదుర్కొంటున్నాడు.తనపై కేసుల కారణంగా జైలుకు వెళ్లి వచ్చినా మార్పు లేకుండా మళ్లీ గంజాయి రవాణాకు పాల్పడినందున,ఈ నెల 23 పోలీస్ ఉన్నతాధికారులు పీడీ యాక్ట్ ఉత్తర్వులను జారీ చేశారు. జూలూరుపాడు పోలీసులు ఈ ఉత్తర్వులను చర్లపల్లి జైలు అధికారుల సమక్షంలో నిందితుడికి అందజేశారు.గతంలో నిందితుడు గంజాయి రవాణా ద్వారా సంపాదించిన ఆస్తులను గౌరవ కోర్టు ఆదేశాల మేరకు జూలూరుపాడు పోలీసులు జప్తు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, మాట్లాడుతూ "ఇలాంటి నేరస్థుల కారణంగా ఎంతో మంది యువత మత్తుకు బానిసలవుతున్నారు. వారి భవిష్యత్తు నాశనం కాకుండా ఉండేందుకు 'చైతన్యం %-% డ్రగ్స్‌పై యుద్ధం' కార్యక్రమం కింద అక్రమ రవాణాపై దాడులు కొనసాగిస్తున్నాం. ఇలాంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, వారిపై పీడీ యాక్టు కింద చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. నిందితుడిపై పీడీ యాక్ట్ అమలులో కృషి చేసిన డీఎస్పీ రెహమాన్, సీఐ శ్రీలక్ష్మి , జూలూరుపాడు పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఎస్.ఐ.ఆర్. జాబితా పకడ్బందిగా తయారు చేయాలి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి







**చర్చ :- కరీంనగర్ :** ఎస్.ఐ.ఆర్. ఓటర్ జాబితా పకడ్బందిగా తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై జిల్లా కలెక్టర్ల తో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈ కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కోసం చేపట్టిన ప్రిపరేటరీ కార్యాచరణలో పురోగతి ఉండాలని, 2002 లో చేసిన ఎస్.ఐ.ఆర్. తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను బూత్ స్థాయి అధికారుల సహకారం తీసుకొని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్. నిర్వహణ కంటే ముందు ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్. డేటాను 2025 ఎస్.ఐ.ఆర్. డేటా తో కంపేర్ చేసుకోవాలని ఈ రెండు జాబితాలో కామన్ గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని అన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లోజిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ లో భాగంగా క్యాటగిరి 'ఏ' ని బి.ఎల్.ఓ. యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సి, డి లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. ఈ.ఆర్.ఓ. కార్యాలయంలో ఇద్దరు బూత్ స్థాయి అధికారులను ప్రత్యేకంగా కేటాయించి శనివారం నాటికి మ్యాపింగ్ పూర్తి చేస్తామని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

# సిపిఐ వందేళ్ల ఉత్సవాలకు జయప్రదం చేద్దాం ఎస్.కె. సాబీర్ పాషా

- గడపగడపకు శతవసంతాల ఉత్సవాల సమాచారం చేరవేయాలి
- డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జాతీయ స్థాయి బహిరంగ సభ
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా
- జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు ప్రారంభం



**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి పుట్టుకొచ్చి, ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని, నవభారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరగనున్న శతవసంతోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు.శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కొత్తగూడెం పట్టణంలోని రామవరం ఏరియాలో ప్రచార, నిధి సేకరణ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శతవసంతాల వేడుకలకు డిసెంబర్ 26న ఖమ్మం నగరం వేదిక కానుంది. ఈ మహాసభకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 40 దేశాలకు చెందిన ప్రతినిధులు, కమ్యూనిస్టు ప్రముఖులు హాజరుకా న్నారు,అని తెలిపారు.జిల్లా నుండి లక్ష మందిని ఈ బహిరంగ సభకు తరలించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతి మండలం, గ్రామస్థాయిలో ప్రచార బృందాలు, నిధి సేకరణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని చెప్పారు.వందేళ్ల ఉత్సవాలు కేవలం పార్టీ వేడుకలు కావు ఇవి ప్రజల పోరాటాల చరిత్ర, శ్రమజీవుల గౌరవానికి చిహ్నం. ఈ ఉత్సవాలను విజయవంతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సాబీర్ పాషా పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఎస్.కె. ఫహీమ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, పద్మ, నాయకులు గోపికృష్ణ, దబ్బెట్టి గురుమూర్తి, పాటి మోహన్, గుత్తుల శ్రీనివాస్, గుగులోత్ నగేష్, తూముల శ్రీనివాస్, ఖయూమ్, జలీల్, కృష్ణ, బాలాజీ, కోరిమి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు.. నేడు..పైపై పూతలే....

- నాసిరకం ప్యాచ్ వర్క్‌లు
- వర్షాలతో బయటపడ్డ బండారం









**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** రోడ్లపై వేసే ప్యాచ్‌వర్క్‌ల నాణ్యత మరోసారి బట్టబయలైంది. మూడునాళ్ల ముచ్చటే అన్న చందంగా ప్యాచ్‌వర్క్‌లు చేసిన మూడు రోజుల్లోనే మళ్లీ రోడ్డు యదావిధిగా తయారైంది. దీంతో హడావుడిగా చేసిన ప్యాచ్ వర్క్‌ల నాణ్యత ఒక్క వర్షంతో బట్టబయలైందని వాహనదారులు చర్చించుకుంటున్నారు. విజయవాడ భద్రాచలం జాతీయ రహదారిలో రామవరం గోధుమవాగు వంతెనపై ఏర్పడిన గుంతలను ఇటీవల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అంతే హడావుడిగా అధికారులు కూడా ఈనెల 17వ తేదీన మొరం, కంకర, తారు తీసుకువచ్చి గుంతలను పూడ్చారు. అయితే కనీసం కొద్దిరోజులైనా ఉండాల్సిన ఆ ప్యాచ్ వర్క్‌లు మూడురోజుల్లోనే మొదటికొచ్చాయి. ఒక్క వర్షానికే మళ్లీ గుంతలు యదావిధిగా బయటపడ్డాయి. దీంతో ప్రభుత్వ పనులు ఎంత నాణ్యతగా ఉంటాయో ఇట్టే అర్థమవుతుందని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కమిషన్లు, మామూళ్ల కోసమే ఇలా గుంతలను తాత్కాలికంగా పూడ్చి బిల్లులు చేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా తాత్కాలిక మరమ్మతులు కాకుండా రోడ్డును పూర్తిగా తవ్వి అడుగు నుంచి గ్రావెల్ తోలి కొత్త రోడ్డు వేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# చదివింది గుర్తుండాలంటే...



**చదువు చదువుకున్న సౌఖ్యంబులను లేవు**
**చదువు జదివెనేని సరసుడగును**
**చదువు మర్మమెరిగి చదువగా చూడుము**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

**దీని అర్థం:-** చదువులేని వారికి సౌఖ్యం లభించదు చదువుకున్నవాడే సరసుడు చదువుకోవాలనే అభిలాష కలవాడు విద్యలోని సారాన్ని, మర్మాన్ని గ్రహించడానికి చదవాలి కానీ వృథా పఠనం వలన ఏమీ ప్రయోజనం ఉండదు.

అవును చదివే గొప్ప నిధి. చదువుకు చదువేసాటి మరోటి లేదు. చదువుకున్న వానికి చదువు విలువలు అబ్బినవారికి అన్ని సౌఖ్యంబులు లభిస్తాయి. చదువుకు ఉన్న పవర్ అలాంటిది. ఇది మరి దేనికి ఉండదు. అందుకే చదువే సమయంలో, చక్కగా ఏకాగ్రతతో లక్ష్యసాధనకై చదవాలి తప్ప, ఏదో రొటీన్ గా, టైంపాస్కు చదివితే ఏ ప్రయోజనాలు ఉండవు. సదరు చదువు లోని సారాన్ని, మర్మాన్ని గ్రహించేలా చదవాలి. అప్పుడే జ్ఞాన పరిధి విస్తృతమవుతుంది. చదివిన చదువుకు అర్థం లభిస్తుంది. సాధారణంగా చదివిన చదువుకు పరీక్షలు ఉం టాయి, చక్కగా చదివి అందలి విషయాలను గుర్తించుకుంటే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. అంటే ఏ పరీక్షలైనా సరే చక్కగా రాయాలంటే చదివిన విషయాలు జ్ఞాపకంలో ఉండాలి. బాగా జ్ఞాపకం ఉండాలంటే, చక్కగా గుర్తుండిపోయేలా చదవాలి. జ్ఞాపకం ఉండేలా చదవాలి అంటే చదివిన విషయాలను ఏదో ఒక క్రమంలో గుర్తుంచుకుంటూ సాధ్యమయ్యే రీతుల్లో సదరు విషయాలను పునశ్చరణ (రివ్యూ) (రీకాల్) చేస్తుండాలి. ఎప్పటి కప్పుడు విషయాలను రివ్యూ చేయడంతో విషయాలు జ్ఞాపకంలో ఉండిపోతాయి. కొందరు మేధావులను గమనించండి, వారు చదివిన విషయాలను జీవితకాలమంతా గుర్తుంచుకుంటారు. చదివే సమయంలో క్రమంగా ఒక పద్ధతి ప్రకారం చదివితే విషయాలు గుర్తుండిపోతాయి. ఇక చదివే విషయాలు బాగా గుర్తుండాలంటే.... గమనించండి

1) మొదట శ్రవణం, పునశ్చరణ లను పాటించాలి.

2) తప్పులు లేకుండా చదువుతూ, చదివిన విషయాన్ని అర్థం చేసుకుంటూ సాధ్యమయ్యే రీతుల్లో తిరిగి పునశ్చరణ చేసుకోవాలి.

3) విషయాన్ని ముక్కలుగా విభజించి చదివి, తదుపరి అంతా సమగ్రంగా చదవాలి.

4) చదివే సమయంలో ఏకాగ్రతతో చదువుతూ అందలి ముఖ్యాంశాలను నూతన అంశాలను వెంటనే నోట్ చేసుకోవాలి.

5) నోట్ చేయడమంటే రాయడం, ఒకసారి రాస్తే అనేకసార్లు చదివినంత ప్రయోజనం ఉంటుంది మరి.

6) మనసుపెట్టి చదువుతూ, విషయాన్ని మననం చేసుకోవాలి, పూర్తిగ అర్థం చేసుకోవాలి. 7) ఏ విషయానైనా చదివే సమయ ంలో, మొదట అర్థం చేసుకుంటూ, ఆయా విషయాలను అన్వయి ంచుకుంటూ, చర్చిస్తూ, ముఖ్యాంశాలను గుర్తిస్తూ, వాటిని రాస్తూ చదివితే చక్కని ప్రయోజనాలుంటాయి. అంతేకాకుండా, చదివే విషయాలను దృశ్యంగా ఊహించుకుంటూ అనురూప విషయాల కు అనుసంధానంగా చేసుకుని చదివితే ఇక ఆ విషయాలు బహుగ గుర్తుండిపోతాయి. చాలామంది చదివింది గుర్తుండడం లేదంటారు. అవును కొందరు చదివింది గుర్తుండడం లేదనీ, చదివింది ఏమీ అర్థం కావట్లేదని అంటారు. కాని వారికి సినిమా పాటలు, ఇష్టమైన ఆయా డైలాగులు గుర్తుంటాయి. విషయమేమంటే, ఆయా విషయాల పట్ల మనం చూపే ఆసక్తులు మరియు దృక్పథాలే! నేర్చుకోవాలనే తపన ఉంటే చాలు, ఏదైనా, ఎంతైనా, ఎక్కడైనా నేర్చుకోవచ్చు. దీనికి సరైన ఉదాహరణ ఏకలవ్యుడే! నూతన విషయాలను నేర్చుకోవాలనే తృష్ణ ఉంటే చాలు, ఎంతైనా నేర్చుకోవచ్చు. అందుకే ఒకసారి ముందు రాసిన ఏడు విషయాలను గమనించి వాటిని అనుకరించండి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఉదాహరణకు, నేను 90వ దశకంలో ముంబై యూనివర్సిటీలో చదివే రోజుల్లో, జమ్ము నుండి వచ్చిన ఒక ప్రొఫెసర్ మా తరగతిలో ఒక ప్రశ్న వేశారు. దానికి సరైన సమాధానం కరువైంది. నేను మాత్రం– ప్రతి దానిని అన్వయించుకుంటూ ఎప్పటికప్పుడు రివ్యూ చేయాలన్నాను. ఆ ప్రొఫెసర్ ఏకీభవిస్తూ నన్ను ప్రశంసించారు. చదివే విషయాలను అన్వయించుకుంటూ, వాటిని పోల్చుతూ రివ్యూ చేస్తూ చదివితే ఎక్కువ కాలం గుర్తుడి పోతాయి. ఒక పరిశీలన విశ్లేషణ ప్రకారం బి చదివే విషయం ఏదైనా... సరే!

- **ఏదో రొటీన్ గా చదువుతూ పోతే 10% ప్రయోజనం ఉంటుంది.**
- **అదే వినడంతో పాటు చదివితే 20% ప్రయోజనం ఉంటుంది.**
- **గట్టిగ, ఏకాగ్రతతో చదివితే 50 నుండి 60% ప్రయోజనం ఉంటుంది.**
- **చదివే విషయాన్ని ఇతరులతో చర్చిస్తూ చదివితే 70% ప్రయోజనం ఉంటుంది.**
- **చదివే విషయాలను అనుభవంతో చదివితే 80% ప్రయోజనం ఉంటుంది.**
- **థియరీ అండ్ ప్రాక్టీస్ తో చదివితే 90% ప్రయోజనం ఉంటుంది.**
- **అదే ఇతరులకు నేర్పుతూ చదివితే 95% ప్రయోజనం ఉంటుంది.**

ఇతరులకు నేర్పడం అంటే చెప్పడం, వివరించడం, విశ్లేషించడమే. అంటే చెప్పే ముందు ప్రిపేర్ కావడం తప్పనిసరిగా గమనించవలెను. చక్కని ప్రిపరేషన్ తో సబ్జెక్టును కరెక్టుగ, ఖచ్చితంగా ప్రజెంట్ చేయవచ్చు. ఒక విషయాన్ని చెప్పే ముందు ప్రిపేర్ కావడం ఎంతో ప్రయోజనాన్ని చూపుతుంది. ఇది ఉపాధ్యాయులందరికీ మరీ ముఖ్యం. విద్యాహక్కు చట్టం 2009 (ఆర్టిఈ) ఈ విషయాన్ని చాలా వివరంగా స్పష్టం చేసింది. విషయాన్ని బోధించే ముందు అందుకు తగు రీతుల్లో సిద్ధపడి తరగతిలో బోధిస్తే చక్కని ప్రయోజనాలు%శీ%టాయని పేర్కొంది. మొత్తం వర్క్ లోడ్ కు ఉన్న సమయంలో సగం ప్రిపరేషన్ కే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టంగా సూచించింది. చక్కని ప్రిపరేషన్ తో ఎలాంటి విషయాలనైనా బ్రహ్మాండంగా ప్రజెంట్ చేయవచ్చుననేది సారాంశం. దీనినే 3పి (పి) సూత్రంగా చెప్పవచ్చు. ప్లానింగ్, ప్రిపరేషన్, ప్రజెంటేషన్, ఈ మూడు 'పి' లతో బ్రహ్మాండమైన ఫలితాలను రాబట్టవచ్చు. ఈ సూత్రం ఆయా పరీక్షల సిద్ధపాటు లోను వర్తిస్తుంది. ఏం చదివాం, ఎంత చదివాం, సొంతం చదివాం, అంతా చదివాం అనేవి ముఖ్యం కాదు. చక్కని ప్లానింగ్ తో, క్రమబద్ధమైన రీతుల్లో ప్రిపేర్ అవుతూ, విషయాలను చక్కగా ప్రజెంట్ చేస్తే బ్రహ్మాండమైన ఫలితాలను రాబట్టవచ్చు. అంతా చదివాం అన్నది ముఖ్యం కాదు. ఎలా ప్రజెంట్ చేశామన్నది మరీ ముఖ్యం. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధపడే అభ్యర్థులు ఈ విషయాలను గమనించాలి. క్లుప్తంగా, చదువనేది గొప్ప గుప్త సంపద. చక్కని సాంప్రదాయ పద్ధతుల్లో స్వంతం చేసుకునే ప్రయత్నాలు చక్కని ఫలితాలనిస్తాయి. అందుకే, చదువుకు చదువే సాటిగా చెప్పబడింది. ఇక లక్షణంగా చదవండి మరి!

ఫోటో డాక్టర్ ప్రభుదయాల్
డాక్టర్ ప్రభు దయాల్
పూర్వ ప్రిన్సిపాల్, గిరిజన బీఈడీ కళాశాల, ఐటీడీఏ భద్రాచలం
మాజీ సెనెట్ మెంబర్, కాకతీయ యూనివర్సిటీ వరంగల్,
శాశ్వత సభ్యుడు ఐఏటిఈ



# బీహార్‌లో వేడెక్కుతున్న రాజకీయం !

బీహార్ శాసనసభ ఎన్నికల వేళ విమర్శలు, ప్రతి విమర్శలతో ప్రచారం వేడెక్కింది. ఆర్‌జెడి పరిపాలన నాటి అవినీతి గురించి వందేళ్లయినా చర్చించుకుంటారని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై ఆర్జెడి నేత తేజస్వి యాదవ్ ఘాటుగానే స్పందించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో బీహార్‌కు ఒరిగిందేమిటని నిలదీశారు. ఇకపోతే ఇక్కడ ఎన్నికలను ఎదుర్కొంటున్న ఇండియా బ్లాక్ మహా ఠట్‌బంధన్ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్‌ను ఏకాభిప్రాయంతో ప్రకటించి అధికార జెడియు నేతృత్వంలోని ఎన్‌డిఎకి తిరుగులేని సవాల్ విసిరింది. అయితే కూటమి నేతల మధ్య ఏకాభిప్రాయం మాత్రం కుదరలేదు. అందుకే పలుచోట్ల పరస్పర పోటీకి దిగారు. దీనికితోడు ప్రచార పోస్టర్లలో రాహుల్ బొమ్మ లేకుండా ఆర్‌జెడి ముందుకు వెళుతోంది. ఇవే అంశాలను ఎన్‌డిఎ ఎత్తిచూపు తోంది. వారిమధ్యన పొత్తులే సరిగా లేవని, అది మహాగట్‌బంధన్ ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. ప్రశాంత్ కిశోర్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది కూడా ముఖ్యం. పికె కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్న ఈ రెండు కూటములను నిలవరించి ముందుకు రావడం కష్టమే. అలాగని హంగ్ ఏర్పడుతుందని ఎక్కడా చెప్పడం లేదు. బీహార్‌లో గత దశాబ్దంన్నర పాలనా కాలంలో నితీష్ వేసిన వేషాలు అన్నీ ఇన్నీ కావు. పదవే లక్ష్యంగా కూటములు ఫిరాయించిన చరిత్ర ఆయన స్వంతం. ఆయన విధానాన్ని బిజెపి అందివచ్చిన ప్రతిసారీ వల వేసి ఉపయోగించుకుంది. 2020 అక్టోబర్–నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బిజెపి పంచన చేరి నితీష్ సిఎం అయ్యారు. ఆ పార్టీ తనను ఇబ్బంది పెడుతోందని పదవికి రాజీనామా చేసి మహా ఘట్‌బంధన్ వైపు వచ్చి తిరిగి సిఎం అయ్యారు. రెండేళ్లన్నా గడవక ముందే, సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముంగిట 2024 జనవరిలో ఎన్‌డిఎ తీర్థం పుచ్చుకొని పదవి




కాపాడుకున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి కావాల్సిన సీట్లు తగ్గగా తన సీట్లతో భుజం కాసి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నితీష్ పార్టీకి బిజెపి కంటే తక్కువ సీట్లొచ్చినా ఆయన్నే సిఎం కుర్చీలో కూర్చోబెట్టామంటున్న బిజెపి ప్రస్తుత ఎన్నికల్లో తన గొంతును సవరిస్తోంది. మొత్తం 243 సీట్లలో బిజెపి, జెడియు చెరో 101 పోటీ చేసి, తతిమ్మా స్థానాలను తమ భాగస్వామ్య పార్టీలకు కేటాయించాయి. కూటమి విస్తృత ప్రయోజనాల కోసం తాము గతంలో పోటీ చేసిన సీట్ల కంటే ఇరువురం దిగొచ్చి తగ్గించుకున్నామని బిజెపి చెబుతున్నదాంట్లో నిజం కనిపించదు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ జెడియును మింగేసి ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తోందని కొన్నేళ్ల బీహార్ రాజకీయ పరిణామాలను బట్టి తెలుస్తుంది. నితీశ్‌ను నమ్మినట్ఉ కనిపిస్తున్నా..ఎప్పుడైనా మింగేందుకు సిద్దంగా ఉంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధిస్తే నితీశ్‌ను పక్కన పెట్టడం ఖాయమని తెలుస్తోంది. బిజెపి రాజీకయంగా వేసే ఎత్తుగడలు పలు రాష్ట్రాల్లో ఇప్పటికే రుజువైంది. అందుకు తార్కాణం మహారాష్ట్రనే. సిఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ఎన్‌డిఎ అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నప్పటికీ బిజెపికి ఎక్కువ సీట్లు రావడంతో సిఎం పదవిని బిజెపి తీసుకొని కూటమి పొత్తు ధర్మానికి నీళ్లొదిలింది. అటువంటిదే బీహార్‌లో నితీష్ విషయంలో బిజెపి చేయదని గ్యారంటీ లేదు. ఇకపోతే ఎన్నికలకు ముందుగానే తమ ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడైన ముఖేష్ సహాని పేరును సైతం ప్రకటించి ఎన్నికల సమరానికి సై అంది. అయితే ఆర్‌జెడి గత పాపాలు వెన్నాడుతున్నాయి. లాలూ హయాంలో జరిగిన కుంభకోణాలు ఎన్నో ఉన్నాయి. తమ భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో ఎలాంటి ఇబ్బందులూ లేవని డాంబికాలు పలుకుతున్న ఎన్‌డిఎ తమ సిఎం అభ్యర్థి ఎవరో ఎన్నికల అనంతరమే ప్రకటిస్తామని బిజెపి, అమిత్‌షా దాటవేస్తూ వచ్చారు. జెడియు చీఫ్, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఎ ఎన్నికలకు వెళుతోందని అంటూనే, ఈ సారి నితీష్ సిఎం అవుతారన్న గ్యారంటీ లేదని చెప్పకనే చెప్పారు. దీన్నిబట్టి నితీష్ మెడపై బిజెపి కత్తి వేలాడతీసిందని అర్థమవుతుంది. బీహార్‌లో గెలిచేందుకు బిజెపి తొక్కని అడ్డదార్లు లేవు. ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్‌ఐఆర్)ను ప్రయోగించింది. ఇ.సి కి ఎంతమాత్రం సంబంధం లేని పౌరసత్వ నిర్ధారణ అంశాన్ని చేర్చేలా పావులు కదిపింది. దీనిపై ప్రతిపక్షాలు సుప్రీం కోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. ఏకంగా 65 లక్షల ఓట్లు తొలగించారు. దీనిపై విచారణకు సుప్రీం కోర్టు ఆదేశించినా ఇంకా పూర్తి స్థాయిలో విచారణ లేదు. ఓట్ల చోరీపై మహా గట్‌బంధన్ పెద్ద ఆందోళనే చేసింది. మహా గట్‌బంధన్‌కు సంబంధించి 11 సీట్లలో స్నేహ పూర్వక పోటీలు కొనసాగుతున్నాయి. నితీష్ ప్రభుత్వంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని ఇప్పటికే ముందస్తు సర్వేలు చెప్తున్నాయి. బీహార్‌లో బిజెపి, దాని మిత్రులను ఓడిస్తేనే కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు కొంత మేరకైనా బ్రేకులు పడతాయని విపక్ష కాంగ్రెస్ భావిస్తోంది. ఆ లక్ష్య సాధన కోసం తమలోని చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరించుకొని మహా గట్‌బంధన్ పని చేయాలని వారు కోరుకుంటున్నారు. అయితే ఈసారి బీహార్‌లో ఎవరికీ అనుకూలంగా పరిస్థితి లేదు. అలాగే ఎవరిని ప్రజలు వ్యతిరేకిస్తున్నారో కూడా చెప్పలేక పోతున్నారు. ఈ దలు రేపటి ఎన్నికల్లో ప్రజలు ఎవరివైపు అన్నది వేచిచూడాలి.

# హ్యామ్ టెండర్లలో 8వేల కోట్ల కుంభకోణం

**దీనిపై ఇక నిత్యం పోరాడుతూనే ఉంటాం**
**అవినీతిలో మునిగితేలులుతున్న మంత్రులు**
**మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శలు**

**హైదరాబాద్,అక్టోబర్25:** ఇందిరమ్మ రాజ్యంలో రోజుకో అవినీతి, పూటకో కుంభకోణం బయటపడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు. ఓ పని టెండర్‌కు సంబంధించి మంత్రుల మధ్య వివాదం తలెత్తితే సీఎం ఇద్దరినీ కూర్చో బెట్టి వాటాలు పంచారని ధ్వజమెత్తారు. డెక్కన్ సిమెంట్స్ కంపెనీ వారిని గన్ పెట్టి బెదిరించారని, ఇందులో సీఎం పాత్ర ఉందని మంత్రి కూతురే ఆరోపించారన్నారు. ముఖ్యమంత్రి, సీఎం పేషీ మీద వచ్చిన ఆరోపణలు ప్రజలకు తెలుసునని చెప్పారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, డాక్టర్ కే. సంజయ్, పార్టీ నేతలు ఆయాచితం శ్రీధర్, కే. కిషోర్ గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మద్యం సీసాల హోలోగ్రాం కుంభకోణంలో సీఎం, మంత్రి మధ్య తలెత్తిన వివాదంలో అధికారిని బలి చేశారని మండిపడ్డారు. అవినీతి, ముడుపుల మీద మంత్రులు రోజూ కొట్లాడుకుంటున్నారని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యమంటే కుంభకోణాల నిలయం, అవినీతి మయంగా మారిందన్నారు. తెలంగాణలో రోడ్లకు మహర్దశ అని మంత్రులు అంటున్నారని, రూ.27 వేల కోట్లతో రోడ్లు వేయబోతున్నామని మంత్రులు చెప్పారని, ఇందులో వేల కోట్ల కుంభకోణం ఉందని ఆరోపించారు. హ్యామ్ కాదు.. అది ఒక పెద్ద స్కామ్ అని, రోడ్డు బాగుచేసే ముసుగులో దోపిడీకి రంగం సిద్ధమైందన్నారు. 'హైబ్రిడ్ అన్యుటీ మోడ్ (హ్యామ్ ) టెండర్లలో రూ.8 వేల కోట్ల కుంభకోణం జరిగింది. హ్యామ్‌లో కిలోమీటర్‌కు 85 శాతం అంచనా వ్యయం పెంచారు. రూ.9 వేల కోట్లతో పూర్తయ్యే రోడ్లకు రూ.17 వేల కోట్లకు టెండర్లు పిలిచారు. ఇందులో రూ.8 వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం లూటీ చేస్తున్నది. సీఆర్‌ఎఫ్ కింద కిలోమీటర్‌కు రూ.కోటి 75 లక్షలు ఖర్చు అవుతుంది. హ్యామ్ కింద ఇచ్చిన టెండర్లలో కిలోమీటర్‌కు రూ.3కోట్ల 30 లక్షల వ్యయం అవుతుంది. సీఆర్‌ఎఫ్ కింద ఇచ్చిన రోడ్ల పనుల టెండర్ల జీవో, హ్యామ్ జీవో కేవలం పది రోజుల తేడాలో వచ్చాయి. సీఆర్‌ఎఫ్ కింద ఇచ్చిన జీవోలో కిలో మీటర్‌కు ఓ రేటు, హామ్ జీవోలో మరో రేటు ఎలా ఉంటుంది. హ్యామ్ రోడ్ల టెండర్లు దక్కించుకున్న వారికి 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ప్రభుత్వం చెల్లిస్తోంది. ఈ రూ.17 వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయో అందరికీ తెలుసు. హ్యామ్ కింద కిలోమీటర్ రోడ్డుకు మెయింటెనెన్సుకు మరో రూ.2.5 కోట్లు కేటాయిస్తున్నారు. అంటే కిలోమీటర్ రోడ్డుకు హామ్ కింద రూ.6 కోట్లు ఖర్చవుతుంది. హ్యామ్‌లో 40 శాతం ప్రభుత్వం, 60 శాతం ప్రైవేటు సంస్థలు భరిస్తాయని అంటున్నారు. ప్రైవేటు సంస్థలు బ్యాంకుల నుంచి తెచ్చే అప్పులకు ప్రభుత్వమే వడ్డీ కట్టాల్సి ఉంటుంది. మొత్తం మీద హ్యామ్ మోడల్ ప్రజల మీద పెను భారం మోపేదిగా ఉంది. ఈ టెండర్లను తక్షణమే రద్దు చేయాలి. హ్యామ్ రోడ్లలో పాలుపంచుకుంటున్న ఇంజినీర్లు, అధికారులు, బడా కాంట్రాక్టర్లు ప్రభుత్వ దోపిడీలో భాగస్వామ్యం కావద్దని మనవి. ఇందులో పెద్ద అవినీతి జరుగుతున్నందున కేంద్ర దర్యాప్తు సంస్థలు తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఇద్దరు కేంద్రమంత్రులు రాష్ట్రం నుంచి ఉన్నారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా హ్యామ్ టెండర్లపై సీబీఐ దర్యాప్తు చేయించాలి. దోచుకునే విషయంలోనే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి రోల్ మోడల్ అయ్యింది. ఢిల్లీకి మాటి మాటికీ సీఎం వెళ్లేది తన అవినీతి నుంచి కాపాడుకునేందుకే. పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వరు కానీ హ్యామ్ కింద మొబిలైజేషన్ అడ్వాన్సులు ఎలా చేస్తారు. హ్యామ్ రోడ్ల నిబంధనలు చిన్న కాంట్రాక్టర్లకు హాని చేసే విధంగా ఉన్నాయ్.



## యత్రీంద్ర అలా అనలేదు కుమారుడి వ్యాఖ్యలపై సిద్ధరామయ్య



**బెంగళూరు:** కర్ణాటకలో సీఎం మార్పు అంశంపై కొద్దికాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ యతీంద్ర ఇటీవల చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దీనిపై సిద్ధరామయ్య తొలిసారి స్పందించారు. యతీంద్ర వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు.'అసలు ఏమి చెప్పదలచుకున్నావని యతీంద్రను నేను అడిగాను. తన సిద్ధాంతాల గురించే చెప్పాలని అనుకున్నట్టు యతీంద్ర తెలిపాడు. ఫలానా వ్యక్తి సీఎం కావాలని యతీంద్ర అనలేదు' అని సిద్ధరామయ్య వివరించారు. బెళగావి జిల్లాలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో యతీంద్ర మాట్లాడుతూ, తన తండ్రి రాజకీయ కెరీర్ చివరి దశలో ఉందన్నారు. ఈ పరిస్థితిలో బలమైన, ప్రగతిశీల భావజాలం ఉన్న నాయకుడు కావాలని, ఆయనకు సిద్ధరామయ్య మార్గదర్శిగా ఉంటారని చెప్పారు. సతీష్ జార్కిహోళికి ఆ లక్షణాలు ఉన్నాయని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని కొద్దికాలంగా సొంత పార్టీ నేతలు పలువురు డిమాండ్ చేస్తున్న క్రమంలో సతీష్ జార్కిహోళి పేరును యంత్రీంద్ర తెరపైకి తీసుకు రావడం చర్చనీయాంశమైంది.డీకే స్పందనిదేసిద్ధరామయ్య రెండున్నరేళ్ల పాలన నవంబర్ 20తో ముగుస్తున్న నేపథ్యంలో నాయకత్వ మార్పు జరగనుందనే ప్రచారం జరుగుతోంది. సీఎం పీఠాన్ని ఆశిస్తున్న శివకుమార్ తాజాగా యతీంద్ర వ్యాఖ్యలపై స్పందించారు. 'పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తాం. ఇప్పుడు నేను మాట్లాడను. సంబంధిత వ్యక్తులతోనే మాట్లాడతాను' అని డీకే తెలిపారు. ఆ ప్రకారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ-కర్ణాటక ఇన్‌చార్జి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా దృష్టికి ఈ విషయాన్ని డీకే తీసుకువెళ్లే అవకాశం ఉంది.

కాగా, యతీంద్రపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు ఇక్బాల్ హుస్సేన్, వి.శివగంగ డిమాండ్ చేశారు. ఇటీవల డీకే ముఖ్యమంత్రి కావాలని ప్రకటనలు చేసినందుకు ఈ ఇద్దరు ఎమ్మెల్యేలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. యతీంద్ర వ్యాఖ్యలపై ఇక్బాల్ ఘాటుగా స్పందించారు. మేము ప్రకటన చేస్తే బలవంతంగా (బలాత్కార్) చేసినట్టు, యతీంద్ర ప్రకటన చేస్తే చమత్కారం (మ్యాజిక్) చేసినట్టు అవుతుందా? అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కుమారుడు పరిపక్వత లేని వ్యాఖ్యలు చేశారని, ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోవాలని అన్నారు. తాము వ్యక్తిగతంగా ప్రకటనలు చేస్తే షోకాజ్ ఇచ్చినప్పుడు ఎంత సీఎం కుమారుడైనా యతీంద్రపై కూడా అధిష్టానం చర్యలు తీసుకోవాలని శివగంగ డిమాండ్ చేశారు.

## తేజస్వి యాదవ్ ప్రజానాయకుడు కాలేడు.. తమ్ముడి సామర్థ్యంపై తేజ్‌ప్రతాప్ కామెంట్స్




తన తమ్ముడు తేజస్వి యాదవ్ ప్రజా నాయకుడు కాలేడని ఆయన సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ వ్యాఖ్యానించాడు. బీహార్‌లో జేపీ లోహియా, కర్పూరీ ఠాకూర్, లాలూ ప్రసాద్ యాదవ్ తదితర కొందరు సీనియర్ నేతలు మాత్రమే ప్రజా నాయకులని చెప్పారు. ప్రజా నాయకుడిగా గుర్తింపు పొందే లక్షణాలు తేజస్వి దగ్గర లేవని విమర్శించారు.

కేవలం తమ తండ్రి పేరును చెప్పుకుని మాత్రమే తేజస్వి ఈస్థాయికి వచ్చాడని తేజ్‌ప్రతాప్ వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో తాను ఏ పార్టీతోనూ పొత్తుపెట్టుకోబోనని అన్నారు. తాను ఇక ఆర్జేడీతో కలువబోనని, తనకు ఏ పదవులపైన వ్యామోహం లేదని చెప్పారు. ఆర్జేడీ నుంచి ఏదైనా పదవిని ఆఫర్ చేసినా తాను తిరస్కరిస్తానని తెలిపారు. ఎప్పుడూ ఎవరితోనూ పొత్తు కలిసే ప్రసక్తే లేదని చెప్పారు.అంతేగాక మహువా అసెంబ్లీ స్థానంలో తనకు ఎదురేలేదని తేజ్‌ప్రతాప్ యాదవ్ అన్నారు. తాను గెలిచిన తర్వాత మహువాలో క్రికెట్ స్టేడియం కట్టిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## టీ కోసం వేచి ఉన్న వ్యాపారి.. రూ.75 లక్షలున్న బ్యాగ్ చోరీ





తిరువనంతపురం: ఒక వ్యాపారి టీ తాగేందుకు వేచి ఉన్నాడు. అయితే ఆయనకు చెందిన రూ.75 లక్షలు ఉన్న బ్యాగును ఒక వ్యక్తి ఎత్తుకెళ్లాడు. గమనించిన ఆ వ్యాపారి అతడి వెంట పరుగెత్తినప్పటికీ ఫలితం లేకపోయింది. కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఎడప్పల్‌కు చెందిన 53 ఏళ్ల వ్యాపారవేత్త ముబారక్ శనివారం బెంగళూరు నుంచి తిరిగి వచ్చాడు. తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో మన్నుతి బైపాస్‌లో బస్సు దిగాడు. టీ తాగేందుకు టీస్టాల్ వద్దకు చేరుకున్నాడు. టీ కోసం వేచి ఉన్న ఆయన రూ.75 లక్షలు ఉన్న బ్యాగును మెడికల్ షాపు ముందు నేలపై ఉంచాడు.

కాగా, ఒక వ్యక్తి అక్కడకు చేరుకున్నాడు. ముబారక్‌కు చెందిన డబ్బుల బ్యాగ్‌ను తీసుకుని అక్కడి నుంచి పరుగెత్తాడు. గమనించిన వ్యాపారి ఇది చూసి షాక్ అయ్యాడు. తేరుకున్న అతడు ఆ వ్యక్తి వెంట పరుగెత్తాడు. ఆ దొంగను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు.అయితే ముబారక్‌ను ఆ వ్యక్తి తోయడంతో కిందపడి గాయపడ్డాడు. తన గ్యాంగ్ ఉన్న కారులోకి ఆ దొంగ ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్వల్పంగా గాయపడిన వ్యాపారి ముబారక్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## బీఎంసీ ఎన్నికలపై బీజేపీ కసరత్తు.. 150 సీట్లలో పోటీ యోచన



ముంబై: త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక బ్రిహాన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై బీజేపీ కసరత్తు ప్రారంభించింది. మహాయుతి కూటమి భాగంగా 140 నుంచి 150 సీట్లలో పోటీ చేయాలని కమలనాథుల ఆలోచనగా ఉంది. బీజేపీ భాగస్వామ్య పార్టీ అయిన ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన 70 నుంచి 80 సీట్లలో పోటీ చేసే అవకాశాలున్నాయి.శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్ పవార్)తో కూడిన 'మహా వికాస్ అఘాడి' (%వీఆా%)లో అంతర్గత విభేదాలున్నాయని, దీనిని అవకాశంగా మలుచుకుని ఎంవీఏకు సంప్రదాయంగా పట్టున్న ప్రాంతాల్లో పాగా వేయాలని బీజేపీ ఆలోచనగా ఉంది. ఇందుకు అనుగుణంగా బూత్ మేనేజిమెంట్, ఓటర్లను నేరుగా కలుసుకోవడం, స్థానిక సమస్యలపై ముంబై బీజేపీ యూనిట్ దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య నేతలు ఐకమత్యంగా ఉండాలని, ఎలాంటి ప్రకటనలు చేయకుండా సంయమనం పాటించాలని, అంతర్గత విభేదాలకు తావీయరాదని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మహాయుతి కూటమి నేతలకు విజ్ఞప్తి చేశారు.బీఎంసీ ఎన్నికలు

ఇటు మహాయుతి కూటమితో పాటు ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహా వికాస్ అఘాడికి కూడా కీలకమే. ముంబై మున్సిపల్ పవర్ డైనమిక్స్ ప్రభావం 2029లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపైన కూడా ఉంటుందని పరిశీలకుల అభిప్రాయంగా ఉంది.

బీఎంసీ ఎన్నికల్లో ఠాక్రే సోదరులు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే పొత్తు పెట్టుకుంటారనే బలమైన అంచనాలు ఉన్నాయి. ఇదే సమయంలో బీజేపీ సైతం ఒంటరిగా పోటీకి వెళ్లాలని అనుకోవడం లేదు. హిందుత్వ ఓట్లు, ప్రభుత్వ అనుకూల ఓట్లు చీలకుండా మహాయుతి భాగస్వామ్య పార్టీలతోనే కలిసి వెళ్లాలని భావిస్తోంది. వేర్వేరుగా పోటీ చేస్తే ఎంవీఏకు, ముఖ్యంగా మరాఠీల ప్రభావం ఎక్కువగా కనిపించే రాజ్ థాకరే ఎంఎన్ఎస్‌కు లబ్ధి చేకూరే అవకాశం ఉందని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.మరాఠీల ఓట్లు, మైనారిటీ కమ్యూనిటీ ఓట్లను ఠాక్రే కూటమి ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని, బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకుగా అగ్రవర్ణాల వాణిజ్య వర్గాలు, నార్త్ ఇండియన్లు, గుజరాతీలు ఉన్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐక్యత, సమన్వయంతో బీఎంసీ ఎన్నికల్లో మహాయుతి సత్తా చాటాలని బీజేపీ వ్యూహరచనగా ఉంది.

## త్వరలో సీబీఎస్ఈ 2026 రిజిస్ట్రేషన్ ప్రారంభం




అక్టోబర్ 25: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 రిజిస్ట్రేషన్ త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 8, 2026న సీటెట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారం అంటే సిలబస్, లాంగ్వేజెస్, అర్హత ప్రమాణాలు, పరీక్ష ఫీజు, పరిక్షా సెంటర్ వివరాలు, ముఖ్యమైన తేదీలు మొదలైనవి త్వరలో సీటెట్ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల కానున్న నోటిఫికేషన్‌లో పొందుపరచనున్నారు. 2026 పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే.. ఈ ప్రోసిజర్ ను ఫాలో అవ్వాలి. మొదట అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలి. ఆ తరువాత ' 2026' లింక్‌పై క్లిక్ చేయాలి. కొత్త రిజిస్ట్రేషన్ చేసి, ఎడ్యుకేషనల్ డీటెయిల్స్ ఎంటర్ చేయాలి. పరీక్ష కేంద్రం, పేపర్ ప్రాధాన్య భాషను ఎంచుకోవాలి. అవసరమైన ఫార్మాట్‌లో పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, సంతకం అప్‌లోడ్ చేయాలి. ఫామ్ ను సబ్మిట్ చేసి, కన్ఫర్మేషన్ పేజీని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.%జుజు% 2026 దరఖాస్తు రుసుమును ఇలా నిర్ణయించారు. జనరల్,అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు రూ.1,200 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఒక పేపర్‌కు రూ.500, రెండు పేపర్లకు రూ.600 చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. 2026 పరీక్ష రెండు పేపర్లుగా ఉంటుంది. తరగతులు నుంచి బోధించాలనుకునే అభ్యర్థులకు పేపర్ నిర్వహిస్తారు.తరగతులు నుంచి బోధించాలనుకునే అభ్యర్థుల కు పేపర్ నిర్వహిస్తారు. ప్రతి పేపర్‌లో 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి నెగటివ్ మార్కింగ్ ఉండదు .ఇందుకు సంబంధించి మరిన్ని వివరాలకు క్లిక్ చేయండి.

## ఆర్జేడీలోకి తిరిగి రావడం కంటే సావటమే బెటర్ : తేజ్ ప్రతాప్ యాదవ్



**పాట్నా:** బీహార్ మాజీ మంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడీలోకి తిరిగి రావడం కంటే మరణాన్నే ఎంచుకుంటానని అన్నారు. పార్టీతో పాటు కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన తేజ్ ప్రతాప్ యాదవ్ జనశక్తి జనతా దళ్ పార్టీని స్థాపించారు. 2015లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మహువా స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు.కాగా, శుక్రవారం పీటీఐకి తేజ్ ప్రతాప్ యాదవ్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్జేడీకి తిరిగి వెళ్తారా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. 'ఆ పార్టీకి తిరిగి రావడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటా. అధికారం చేపట్టాలన్న ఆకలి నాకు లేదు. నైతిక సూత్రాలు, ఆత్మగౌరవం నాకు అత్యున్నతమైనవి' అని అన్నారు.మరోవైపు తమ్ముడు తేజస్వి యాదవ్‌ను ఇండియా బ్లాక్ సీఎం అభ్యర్థిగా పేర్కొనడంపై తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. అధికార పీఠం దక్కించుకునేందుకు ప్రజల ఆశీర్వాదం అవసరమని అన్నారు. 'ప్రజల కోసం పనిచేయడమే నాకు అతి పెద్ద విషయం. నేను హృదయపూర్వకంగా అలా చేస్తా. ప్రజలు నన్ను ప్రేమిస్తారు, విశ్వసిస్తారు' అని అన్నారు.

## లాలూ, రబ్రీ ప్రభుత్వం వస్తే మళ్లీ ఆటవిక పాలనే : అమిత్ షా



**బీహార్** :బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ బీజేపీ నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన మాటల జోరును పెంచారు. శనివారం ఖగారియా ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా.. ప్రతిపక్ష కూటమిపై దుమ్మెత్తిపోశారు. ప్రతిపక్ష మహాఘట్బంధన్‌కు ఓటువేస్తే ఆటవిక పాలనను కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను షా హెచ్చరించారు.ఎన్డీయే సర్కారు బీజేపీని అభివృద్ధిపథంలో నడిపించిందని అమిత్ షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివృద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలని అన్నారు. లాలూ, రబ్రీదేవిల సర్కారు వచ్చిందంటే.. దాంతోపాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయేని గెలిపిస్తే అభివృద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు.ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతో కూడిన కూటమి అని, ఈ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని షా అన్నారు. ఈ మహాఘట్బంధన్, లఠ్బంధన్‌లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని షా ఆరోపించారు. 'వాళ్లు బీహార్‌ను అభివృద్ధి చేస్తారా..?' అని ప్రశ్నించారు. నయాపైసా కూడా అవినీతికి పాల్పడని నరేంద్రమోదీ, నితీశ్‌కుమార్‌లతోనే బీహార్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

## ఐఆర్‌సీటీసీ సేవల్లో మరోసారి అంతరాయం.. వారంలో రెండోసారి




ప్రముఖ రైల్వే టికెట్ల ప్లాట్‌ఫామ్ ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ మరోసారి డౌన్ అయ్యింది. శనివారం ఉదయం 10 గంటలకు తత్కాల్ టికెట్స్ బుకింగ్ సమయంలో ఈ సమస్య తలెత్తింది. టికెట్ బుకింగ్ విండో ఓపెన్ అయిన వెంటనే వెబ్‌సైట్ యాక్సెస్ ఆగిపోయింది. యాప్ సేవల్లో కూడా అంతరాయం నెలకొంది. దీనికారణంగా ఛట్ పూజ వేళ సొంతూళ్లకు వెళ్లాలనుకునే ప్రయాణికులు టికెట్లు బుక్‌చేసుకోలేకపోయారు.డౌన్‌డెటెక్టర్ ప్రకారం.. ఉదయం 10 గంటల తర్వాత వెబ్‌సైట్, యాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా లక్షలాది మంది ప్రయాణికులు రైలు టికెట్స్ బుక్ చేసుకోలేకపోయారు. పండగల వేళ ఈ అంతరాయం ఏర్పడటంతో ప్రయాణీకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఐఆర్‌సీటీసీ డౌన్ అయ్యిందంటూ సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెడుతున్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్‌లో ఎర్రర్ వస్తోందని పేర్కొంటున్నారు. బుకింగ్ పోర్టల్‌లోకి వెళ్లగానే.. ఎర్రర్ వస్తోందని, సైట్ ప్రస్తుతం అందుబాటులో లేదని, తర్వాత ప్రయత్నించండి వంటి మెసేజ్‌లు వస్తున్నట్లు తెలిపారు.కాగా, ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవల్లో అంతరాయం కలగడం ఇదేమీ మొదటిసారి కాదు. ఇటీవలే కాలంలో తరచూ ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి.

పండుగ సీజన్‌లో వెబ్‌సైట్, యాస్ సేవల్లో అంతరాయం ఏర్పడటం వారం రోజుల్లో ఇది రెండోసారి. దీపావళి ముందు అంటే అక్టోబర్ 17న కూడా ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్ సేవల్లో అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే.

## బెంగళూరులోని రోడ్లపై గుంతలకు.. మరో మహిళ బలి




**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూ(రులోని రోడ్లపై గుంతల కారణంగా మరో మహిళ బలి అయ్యింది. బైక్ నడుపుతున్న సోదరుడు సడన్‌గా బ్రేక్ వేశాడు. బైక్ వెనుక కూర్చొన్న అతడి సోదరి రోడ్డుపై పడింది. వేగంగా వచ్చిన లారీ ఆమె తలపై నుంచి వెళ్లడంతో మరణించింది. 26 ఏళ్ల ప్రియాంక కుమారి పూనియా బెంగళూరులోని బ్రిటన్‌కు చెందిన బ్యాంకులో పని చేస్తున్నది. సోదరుడు నరేష్ కుమార్ ఆమెను మాదవర మెట్రో స్టేషన్ వద్ద బైక్‌పై రోజూ దించేవాడు.కాగా, శుక్రవారం ఉదయం ప్రియాంక కుమారి సోదరుడు నరేష్ బైక్‌పై బయలుదేరింది. రోడ్డుపై గుంత కారణంగా ముందు వెళ్తున్న కారు ఉన్నట్టుండి ఆగింది. దీంతో నరేష్ సడెన్‌గా బ్రేక్ వేశాడు. అయితే ఎదురుగా వచ్చిన లారీకి బైక్ హ్యాండిల్ తగిలింది. దీంతో బ్యాలెన్స్ కోల్పోయిన నరేష్ ఎడమ వైపు పడ్డాడు. బైక్ వెనుక కూర్చొన్న ప్రియాంక కుడివైపు రోడ్డుపై పడింది. ఊహించని విధంగా ఆమె తలపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడి కక్కడే మరణించింది.మరోవైపు ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాంకు ఉద్యోగిని ప్రియాంక మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా వైద్యురాలి సూసైడ్.. ఒకరు అరెస్ట్



**మహారాష్ట్ర** :మహారాష్ట్ర సతారా జిల్లాలో 28 ఏండ్ల మహిళా వైద్యురాలు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు తాజాగా ఒకరిని అరెస్ట్ చేశారు. సూసైడ్‌నోట్‌లో రాసిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరైన ప్రశాంత్ బంకర్ ఫల్తాన్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకు న్నారు. అతడిని పూణెలో అరెస్ట్ చేసి నట్లు అధికారులు తెలిపారు.ఫల్తాన్ ఉప-జిల్లా దవాఖానలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బాధితురాలు గురువారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎస్ఐ నిత్యం పెడుతున్న వేధింపులు తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన చేతిపై రాసిన సూసైడ్ నోట్‌లో ఆమె పేర్కొన్నారు. మరో పోలీసు అధికారి ప్రశాంత్ బంకర్ కూడా తనను ఆరోపించారు.

## ఏపీకి రెడ్ అలెర్ట్.. దూసుకొస్తున్న 'మొంథా' తుపాన్




**అమరావతి :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. రాగల 24 గంటల్లో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారనుంది. తీవ్ర వాయుగుండం ఎల్లుండి ఉదయానికి 'మొంథా' తుపానుగా మారే అవకాశం ఉందని ఏపీ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు రెడ్ అలెర్ట్ జారీ చేశారు.వచ్చే నాలుగురోజుల ఈనెల 29 వరకు తుపాను చాలా ప్రభావం చూపిస్తుందని అధికారులు వివరించారు. తుపాను వాయవ్య దిశలో కదిలి ఈ నెల 28 సాయంత్రం కాకినాడ సమీపంలో తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశం ఉంది. తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో గంటలకు 90 నుంచి 110 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని స్పష్టం చేశారు.విశాఖపట్నం నుంచి తిరుపతి వరకూ తుపాను ప్రభావం ఉండనుందని తెలిపారు. ఏపీలోని తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న విద్యా సంస్థలకు 28,29 తేదీల్లో సెలవు ప్రకటించాలని వాతావరణ శాఖ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. భారీ వర్షాలు పడే అవకాశమున్నందున విజయవాడ, ఏలూరు, దివిసీమ, మచిలీపట్నం, గుంటూరు , గోదావరి జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## నాగుల చవితి రోజు అద్భుత దృశ్యం.. శివలింగంపై రెండు నాగుపాములు ప్రత్యక్షం..



**నెల్లూరు జిల్లా :** నాగుల చవితి రోజున అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శివలింగంపై ఓ రెండు నాగుపాములు ప్రత్యక్షమయ్యాయి. ఆ రెండు నాగుపాములు కూడా శివలింగానికి ఇరువైపులా పడగవిప్పి.. భక్తులకు దర్శనమి చ్చాయి. నెల్లూరు జిల్లా మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన ఉన్న విశ్వనాథస్వామి దేవస్థానంలో నాగుల చవితిని పురస్కరించుకుని ఇవాళ ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమయంలో గుడి ప్రాంగణంలోని శివలింగంపైకి రెండు నాగుపాములు చేరుకున్నాయి. తదనంతరం ఆ రెండు పాములు కూడా పడగవిప్పి నిల్చుని నాట్యమాడాయి. శివలింగంపై నిల్చున్న రెండు నాగుపాములను చూసి భక్తులు తరించిపోయారు.

## కర్నూలు బస్ దుర్ఘటన ఎఫెక్ట్.. ఏపీలో విస్తృతంగా ప్రైవేట్ బస్సుల తనిఖీలు



**అమరావతి :** కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రైవేట్ బస్ దుర్ఘటన ఏపీ రవాణా శాఖ స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఆయా ప్రాంతాల్లో ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలతో కదిలిన అధికారులు తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై 289 కేసులు నమోదుచేశారు . ఈ సందర్భంగా 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేశారు.అగ్నిమాపక పరికరాలు లేని ప్రైవేటు ట్రావెల్స్‌కు రూ.7.08లక్షల జరిమానాలు విధించారు. ఏలూరులో 55 కేసులు నమోదు చేసి మూడు ట్రావెల్స్ బస్సులను, తూర్పు గోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు చేసి 4 బస్సులను సీజ్ చేశారు. నిన్న కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరీ ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు పల్సర్ బైకును ఢీకొట్టింది. బైకు ట్యాంక్ పేలడంతో బస్సు కింద ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. క్రమంగా అవి బస్సు మొత్తానికి వ్యాపించడంతో క్షణాల్లోనే పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 19 మంది సజీవదహనం కాగా మరో 27 మంది స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 43 మంది ఉన్నారు.

## ప్రవాసాంధ్రులకు ప్రత్యేక పథకం.. దుబాయ్‌లో ప్రారంభించిన సీఎం



**అమరావతి, అక్టోబర్ 25:** గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న ప్రవాసాంధ్రులకు భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ఓ పథకాన్ని తీసుకువచ్చింది. 'ప్రవాసాంధ్ర భరోసా' పేరుతో ప్రత్యేక బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుబాయ్‌లో ప్రారంభించారు. ప్రవాసాంధ్రుల సంక్షేమం, అభివృద్ధి, భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టీ సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా భీమా పథకాన్ని అందించనుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పనిచేస్తున్న ఆంధ్రాకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఉద్యోగులు, వలస కార్మికులు, విద్యార్థుల కోసం ఈ పథకం తీసుకొచ్చింది రాష్ట్ర సర్కార్. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవచ్చని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి వెబ్ సైట్‌ను సందర్శించవచ్చు. మరిన్ని వివరాల కోసం 24/7 అందుబాటులో ఉండేలా హెల్ప్‌లైన్ నెంబర్ 8632340678, వాట్సాప్ నెంబర్ 8500027678లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకే వీలు కల్పించింది సర్కార్.

## పవన్ కల్యాణ్‌పై కామెంట్స్.. డిప్యూటీ స్పీకర్ ఫిర్యాదు



**అమరావతి:** కూటమి పక్షాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారిపై డీజీపీకి పిర్యాదు చేశారు. అంభోజి వినయ్ కుమార్ పేరుతో ఫేస్‌బుక్‌లో కరుడుగట్టిన వైసీపీ సపోర్టర్ ఫేక్ పోస్టులను పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. దీని వల్ల అధికార కూటమిలో వైషమ్యాలు తీసుకురావడంతో పాటు కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..తాను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఎన్నడూ చేయని కామెంట్లను చేసినట్టు.. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆరోపించారు. ఈ పోస్టులకు సంభందించి స్క్రీన్ షాట్‌లు, లింకులను కూడా తన ఫిర్యాదులో జత చేసినట్లు తెలిపారు.


## వారి విమర్శలను గట్టిగా తిప్పికొడదాం: కూటమి నేతలు



**అమరావతి, అక్టోబర్ 25:** ఉమ్మడి కృష్ణ జిల్లా కూటమి నేతల సమావేశం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికలే అజెండాగా ఈ భేటీ జరిగింది. నియోజకవర్గాల సమస్యలపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవాలని నేతలు నిర్ణయించారు. మాజీ మంత్రులు పేర్ని నాని , జోగి రమేష్‌ల విమర్శలను గట్టిగా తిప్పి కొట్టాలని... ఇక నుంచి వైసీపీ నేతల విమర్శలపై ఉమ్మడి జిల్లా నేతలతో సమిష్టిగా ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహం ఇప్పటి నుంచి సిద్ధం చేసుకోవాలని కూటమి నేతలు నిర్ణయించారు.సమావేశం అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రభుత్వం గత సంవత్సన్నర కాలంగా చేస్తున్న అభివృద్ధిపై రాబోయే కాలంలో చేసే కార్యక్రమాల గురించి సమావేశమైనట్లు వెల్లడించారు. వైసీపీ గతంలో చేసిన అక్రమాలన్నింటినీ బయటకు తీస్తామన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అభివృద్ధికి ఏం చేయాలనే అంశంపై చర్చించినట్లు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డికి అసలు డేటా సెంటర్ అంటే ఏమిటో తెలియక మాట్లాడుతున్నారని విమర్శించారు. రాజకీయాల కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపించారు. జగన్‌కు మద్యం గురించి మాట్లాడే అర్హత లేదని.. పనికి రాని బ్రాండ్‌లు అమ్మిన ఘనత జగన్ దే అంటూ దుయ్యబట్టారు. ఏపీ సురక్ష యాప్‌ను ఇప్పటి వరకు రెండున్నర లక్షల మంది వాడుతున్నారని తెలిపారు. ప్రజలు జగన్‌ను నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి అన్నారు.


తిరువూరు ఘటనపై స్పందిస్తూ.. కుటుంబంలో చిన్న చిన్న గొడవలు రావడం సహజమన్నారు. అయినా ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చూస్తున్నారని తెలిపారు. ఈరోజు జిల్లా అభివృద్ధి గురించి మాత్రమే మాట్లాడడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నిన్న కర్నూలులో జరిగిన బస్సు దుర్ఘటన చాలా దురదృష్టకరమని మంత్రి కొల్లు రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

## పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు బిగ్ అప్డేట్



**అమరావతి :** ఏపీ ప్రభుత్వం పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారు చేసింది. మార్చి 16వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. నవంబర్ 1వ తేదీ నుంచి ఫీజు చెల్లింపు ప్రారంభం కానుంది. కాగా, ఈ సారి పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థుల కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షా కేంద్రాల ఏర్పాటు. .అక్కడ పరీక్షకు వెళ్లే విద్యార్థులకు ఎక్కడా అసౌకర్యం లేకుండా కొత్త విధానం అమల్లోకి తెస్తున్నారు.ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది కొత్తగా హాల్‌టికెట్ల వెనుక భాగంలో పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్‌ను ముద్రించనున్నారు. అందులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి ఎలా చేరుకోవాలో మ్యాప్ వస్తుంది. దీని ద్వారా విద్యార్థులు తాము వెళ్లాల్సిన పరీక్షా కేంద్రాల వివరాలు... చిరునామా గురించి ఎలాంటి సందేహాలు లేకుండా ఈ విధానం అమల్లోకి తెస్తున్నారు. అదే సమయంలో పరీక్షల నిర్వహణకు అవసరమయ్యే చీఫ్ సూపరింటెం డెంట్, ఇన్విజిలేటర్లను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తారు.ఇదే సమయంలో పదో తరగతి విద్యార్థు లెవరినీ డ్రాప్ బాక్సులో పెట్టకూడదని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రతి జిల్లాలో పది ఫలితాల్లో వెనుకబడిన 100 పాఠశాలలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్దేశిం చింది. పదో తరగతి పరీక్షలు రాసే అభ్యర్థు లందరికి తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలని స్పష్టం చేసింది. ఇక.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇం టర్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 23 నుంచి ప్ర థమ సంవత్సరం, ఫిబ్రవరి 24 నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని వెల్లడించింది. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని తెలిపింది.

## ఏపీపై రైల్వే ప్రేమ: రూ.2506 కోట్ల ఆ రైల్వేలైన్ తో రాయలసీమ జిల్లాలకు మహర్దశ



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే పురోభివృద్ధికి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. రాష్ట్రంలో రైలు రవాణాను మరింత పురోగతి దిశగా ముందుకు తీసుకు వెళ్లే ప్రయత్నం జరుగుతుంది. ఇదే క్రమంలో తాజాగా ఆంధ్రప్రదేశ్లో కొత్త రైల్వే ప్రాజెక్టుకు లైన్ క్లియర్ అయింది. కడప జిల్లాలోని పులివెందులకు త్వరలో రైల్వే కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది.పులివెందుల మీదుగా రైల్వే లైన్‌కడప బెంగళూరు మార్గాన్ని పులివెందుల మీదుగా నిర్మించడం కోసం శరవేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ముద్దనూరు, పులివెందుల, ముదిగుబ్బ, శ్రీ సత్యసాయి మధ్య 110 కిలోమీటర్ల రైల్వే లైను నిర్మాణానికి రైల్వే బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాంత వాసులకు రైల్వే సేవలు మరింత మెరుగ్గా అందబోతున్నాయి. రైల్వే చేపట్టే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు 2505.89 కోట్ల రూపాయలుగా ఉంది.ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేసి పంపారు. ఈ డి పి ఆర్ ఆమోదం పొందితే వెంటనే పనులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాయలసీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న క్రమంలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారు. ఇక కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు అవసరమైన రవాణా సదుపాయాలను ఈ రైల్వే లైన్ మెరుగుపరుస్తుంది.మానవ రవాణాతో పాటు సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ తో ఉపయోగంరాయలసీమ పురోగతిలో ఈ రైల్వేలైన్ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ కొత్త రైల్వే లైన్ వల్ల కడప జిల్లాలో ఉద్యాన పంటలకు, బొగ్గు రవాణాకు, ఖనిజ సంపద రవాణాకు, అలాగే ఈ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రానిక్స్, సిమెంట్, స్టీల్ తయారీ కంపెనీలకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది. మానవ రవాణాతో పాటు సరుకు రవాణాకు దోహదం చేస్తుంది.ఇదే సమయంలో ఓబులవారిపల్లె గుంతకల్లు మధ్య అదనంగా రెండు రైల్వే లైన్ల నిర్మాణం కూడా ప్రస్తుతం పరిశీలనలో ఉంది. ఓబులవారిపల్లె రేణిగుంట మధ్య ఇప్పటికే రెండు రైల్వే లైన్లు ఉండగా ఇప్పుడు మూడో లైన్ నిర్మాణానికి కూడా ప్రణాళికలు రూపొందించారు. ఇలా అనేక కొత్త రైల్వే లైన్లు, పులివెందుల మీదుగా ఈ రైల్వే లైన్ ల విస్తరణతో రాయలసీమ పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు పులివెందుల మీదుగా రైల్వే లైన్ ప్రతిపాదనల పైన స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## నిషేధం నుంచి భూములకు విముక్తి, ఇక నుంచి కీలక మార్పులు




**అమరావతి :**ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పై ఉన్న నిషేధం తొలిగింపు దిశగా కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు త్వరలోనే అధికారిక నిర్ణయం తీసుకోనుంది. అతి త్వరలో రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఈ మేరకు మంత్రివర్గ ఉప సంఘం కీలక అంశాల పైన చర్చించింది. భూ కేటాయింపు విధానంలోనూ మార్పుల దిశగా సిఫార్సులు సిద్దమవుతున్నాయి. ఇక నుంచి లీజు ప్రాతిపదికనే కేటాయింపులు చేయాలని డిసైడ్ అయ్యారు.భూ కేటాయింపులు.. వివాదాల పైన ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం కీలక అంశాల పైన ఒక నిర్ణయానికి వచ్చింది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, పయ్యావుల కేశవ్, పి.నారాయణ, కె.పార్థ సారథి భేటీ అయి ఈ అంశాల పైన చర్చించారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977లో చేసిన చట్టసవరణ, నిబంధనలకు లోబడి ఉన్న భూములకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే జిల్లా స్థాయి కమిటీలు ఇచ్చిన నివేదికల్లోని పలు అంశాలపై కూడా కీలక ప్రతిపాదనలు చేసింది. వాటన్నిటికీ ఉపసంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఫ్రీహోల్డ్ కింద కొన్ని రకాల భూములను అనుమతించకూడదని ఆ శాఖ చేసిన ప్రతిపాదనలపై వచ్చే సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రులు నిర్ణయించినట్లు సమాచారం.22ఏ నుంచి తొలగించాలని, ఆ తర్వాత రైతులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని వైసీపీ ప్రభుత్వం 2023లో అసైన్డ్ చట్టాన్ని సవరించింది. ఈ విధానం అమలుకు 2023 డిసెంబరులో జీవో 596 తీసుకొచ్చింది. అయితే నాటి ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతలు కుమ్మక్కై.. 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే విచారణ చేయించింది. జగన్ సర్కారు 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్టవిరుద్ధంగా నిషేధ బాబితా నుంచి తీసేసినట్లు తేలింది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని గత ఏడాది ఆగస్టులోనే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధం విధించింది.వీలైనంత త్వరగా ఫ్రీహోల్డ్ భూములపై నివేదిక ఇవ్వాలనే ముఖ్యమంత్రి ఆదేశాలతో జీవో 596 మార్గదర్శకాల ప్రకారం అర్హత సాధించిన 7.85 లక్షల ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్‌కు అనుమతి రెవెన్యూ శాఖ తాజాగా ప్రతిపాదించింది. భూమి లబ్ధిదారు చేతిలోనే ఉండి సాగు చేసుకుంటుంటే.. అలాంటి వాస్తవికమైన కేసుల్లో ఫ్రీహోల్డ్ జరిగేలా చూడాలని సూచించింది. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన 5.74 లక్షల ఎకరాల భూములను తిరిగి 22ఏలో చేర్చాలన్న ప్రతిపాదనను కూడా సబ్‌కమిటీ ఆమోదించింది. అలాగే పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు మొదలైనవాటికి ఇకపై లీజు ప్రాతిపదికనే కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించింది.

## కర్నూలు బస్సు ప్రమాదంలో కీలక మలుపు



**కర్నూలు:** కర్నూలు జిల్లా లోని కల్లూరు మండలం చిన్నటేకూరు దగ్గర నిన్న(శుక్రవారం) ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో వేమూరి కావేరి సంస్థకి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ ఏసీ బస్సులో ప్రయాణిస్తున్న 19 మంది ప్రయాణికులు మృతిచెందారు. ఈ ఘటన రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. అయితే ఈ బస్సు ప్రమాదం లో మరో కీలక మలుపు చోటు చేసుకుంది. బైక్, బస్సు ప్రమాదం వేర్వేరు ఘటనలుగా కర్నూలు జిల్లా పోలీసులు గుర్తించారు.ఈ బస్సుని ఢీకొనడానికి ముందే శివశంకర్ బైక్‌కి ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బైక్‌పై శివశంకర్, ఎర్రిస్వామి అనే ఇద్దరు వ్యక్తులు ప్రయాణించారని పోలీసులు గుర్తించారు. రెయిలింగ్‌ను ఢీకొట్టి శివశంకర్ బైక్‌తో సహా రోడ్డుపై పడ్డారని చెప్పుకొచ్చారు. ఈ ఘటనలో తీవ్రగాయాలతో స్పాట్‌లోనే శివశంకర్ మృతిచెందాడని తెలిపారు. ఈక్రమంలో శివశంకర్ బైక్‌ను పక్కకు లాగడానికి ఎర్రిస్వామి ప్రయత్నించాడని వివరించారు.అదే సమయంలో బైక్‌ను కావేరి బస్సు ఢీకొట్టిందని చెప్పుకొచ్చారు. బైక్‌ను కావేరి బస్సు ఈడ్చుకెళ్లడంతో మంటలు వ్యాపించాయని తెలిపారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించి ఈ బస్సు దగ్ధమైందని వెల్లడించారు.

## మరో 20 రోజుల్లో సుందర పుట్టపర్తి..



**పుట్టపర్తి(అనంతపురం):** సత్యసాయిబాబా శత జయంతి వేడుకల నాటికి పుట్టపర్తిని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి(%మీూ్రఖశ్రీశ్రీవ ూఱఅసష్ట్రబతీు =వసనఎ%) ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరో 20 రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా పడమటిగేట్ రోడ్డు అభివృద్ధికి రూ.1.4 కోట్లు, వీధిలైట్లు రూ. 20లక్షలు, డ్రైనేజీ రిపేరీ, శానిటేషన్‌కు రూ.70లక్షలు, డీఎంఎఫ్, మునిసిపాలిటీ స్పెషల్‌గ్రాంట్ నిధుల ద్వారా మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు మరో రూ 1.5కోట్ల వ్యయం చేస్తున్నామన్నారు.శానిటేషన్ మరమ్మతు పనులు కోసం ఆదనంగా 20 మంది కార్మికులను నియమించినట్లు తెలిపారు. పట్టణంలో బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ.4కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఉజ్జెల్లి ఐకెపి పిపిసి సెంటరు ఓపెన్ చేయడానికి విచ్చేసిన గవినోళ్ల లక్ష్మారెడ్డి



**నారాయణపేట జిల్లా :**మక్తల్ మండలంలో ఐకెపిఓబిలు ఓపెన్ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమాల్లో ఆర్ఐ సార్ మాగనూరు సిసి కురుమన్న సార్ వివో ఏలు మరియు కాంగ్రెస్ ముఖ్య నాయకులు మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ .శ్రీనివాస్ రెడ్డి వకిటి రాజు సర్పంచ్ వద్వట్ రవీందర్ నరసింహారెడ్డి ఎక్స్ సర్పంచ్ వాకిటి రాజు డీలర్ నరసింహులు మేకల నర్సింగప్ప అవసలి మొనప్ప రైతులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

## కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంలు



**నారాయణపేట్ జిల్లా / :**నారాయణ పేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఈవీఎం గోడౌన్ లో ఈవీఎంలు కట్టు దిట్టమైన భద్రత మధ్య ఉన్నాయని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తెలిపారు. శనివారం ఇక్కడి ఈ వీ ఎం గోడౌన్ ను ఆయన పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా గోడౌన్ ను సందర్శించడం జరిగిందని ఆయన చెప్పారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను చెక్ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్.డి.ఓ. రామచందర్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారినిలు అఖిల ప్రసన్న, రాణి దేవి,సిబ్బంది ఉన్నారు.

## ప్రమాదపుటంచన ప్రయాణం.సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్





**ఉట్కూర్ మండలం / :**మండల పరిధిలోని జక్లేర్ బస్టాండ్ ప్రాంగణం నుంచి జక్లేర్ గ్రామంలోపలికి వస్తున్న క్రమంలో బీటీ రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారిందని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ శనివారంలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసలే మలుపుల ప్రదేశమని,ఆపై రహదారి కోతకు గురి కావడంతో ఎదురెదురుగా వస్తున్న ఆటోలు,కార్లు,బస్సులతో పాటు లోడుతో వస్తున్న భారీవాహనాలు రోడ్డు దింపే క్రమంలో కోతకు గురైన ప్రదేశాలలో దిగబడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు ఈ ప్రదేశాలను గుర్తించి కోతకు గురైన రహదారిపై మట్టిని వేసి ప్రమాదాలను నివారించాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఐటియు ముందుంటుంది

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జాజుల రుద్ర కుమార్



**రాజేంద్రనగర్, అక్టోబర్ 25 :** కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిఐటియు పోరాడుతుందని జిల్లా ఉపాధ్యక్షులు జాజుల రుద్రకుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో శనివారం సిఐటియు మండల సభ కేంద్రం అంబేద్కర్ చౌరస్తా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు జాజుల రుద్రకుమార్ మాట్లాడుతూ శంషాబాద్ లో ఉన్నటువంటి అన్ని రంగాల కార్మికులకు సిఐటియు ముందుండి పోరాటం చేసి సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని కార్మికులకు కనీస వేతనాలు ఉద్యోగ భద్రత ఈఎస్ఐ పిఎఫ్ పర్మనెంట్ ఇన్సూరెన్స్ లాంటి సమస్యలను పరిష్కరించే దిశగా సిఐటియు ముందుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో భాగంగా నాలుగు కోడలు తెచ్చిందని ఈ కోడులను ఎత్తివేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీన కమిటీ 9 మందితో ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నగేష్ ప్రవీణ్ నర్సింగరావు జయేందర్ ఇందిరా సుజాత శోభ స్వప్న పవన్ కుమార్ రవి గణేష్ తదితరులు పాల్గొన్నారు.


## గురుకుల ఉద్యోగాలు మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని వినతి



**నారాయణపేట్ జిల్లా :**తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గురుకులలో మిగిలిన ఖాళీ ఉద్యోగాలను గురుకుల వ్రాత పరీక్షలో తదుపరి మెరిట్ సాధించిన అభ్యర్థులతో భర్తీ చేయాలని గురుకుల అభ్యర్థులు హెచ్.నర్సింహా, చెన్నారెడ్డి, శివరాజు,రాకేష్, సుహన్ రాజు, అలీం పాషా తదితరులు ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి గారికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు 9210 ఉద్యోగాల భర్తీ కోసం 2023 లో వ్రాత పరీక్షలు నిర్వహించారు అని తెలిపారు. డీల్, జెల్, పీజీటీ మరియు టీజీటీ కి కామన్ పేపర్ ఉండడం వలన ఒక్కరికి మూడు,నాలుగు ఉద్యోగాలు వచ్చాయి అని అన్నారు.ఉద్యోగాలు అవరోహణ క్రమంలో భర్తీ చేయకపోవడం వలన ఒక్కరు రెండు,మూడు ఉద్యోగాల అపాయింట్మెంట్ ఆర్డర్లు అందుకున్నారు అని వివరించారు.ఆ ఉద్యోగాలలో ఉన్నత ఉద్యోగంలో జాయిన్ కావడం వలన 1800 పోస్టులు మిగిలాయి అని చెప్పారు. ఈ పోస్టులు గురుకుల వ్రాత పరీక్షలు వ్రాసి సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకొని తదుపరి మెరిట్ లో ఉన్న అభ్యర్థితో భర్తీ చేయాలని హైకోర్టులో మెరిట్ సాధించి ఉద్యోగాలు రాని అభ్యర్థులు పిటిషన్లు వేయడం జరిగింది అని తెలిపారు.ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు 22 సెప్టెంబర్ 2025 లో తదుపరి మెరిట్ అభ్యర్థులతో ఖాళీగా మిగిలిన ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదేశించింది అని అన్నారు.తీర్పు ఇచ్చి రెండు నెలలు పూర్తి అయిన గురుకుల అధికారుల్లో గాని లేదా తెలంగాణ ప్రభుత్వం కానీ ఎలాంటి స్పందన లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ఈ సమస్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొనిపోయి గురుకుల అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

## షాద్ నగర్ వైద్యురాలి వ్యవహరించిన తీరు ఫిర్యాదు

- విచారణ చేపట్టిన వైద్యశాఖ అధికారులు
- నిష్పక్షపాతంగా విచారణ జరపాలి.
- పేద ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందించాలి
- షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి ముందు
- జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఆందోళన





**షాద్ నగర్ అక్టోబర్25:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఈనెల 17వ తేదీన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం ఓవర్ స్పీడ్ కారణంతో బస్సు దిగుతూ కిందపడిన లావణ్య అనే మహిళను చికిత్స నిమిత్తం షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సుప్రజ వ్యవహరించిన తీరుపై తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ కు లావణ్య సోదరుడైన జర్నలిస్టు మిద్దెల సత్యనారాయణ పిర్యాదు చేశారు ఆ పిర్యాదుతో రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ ఆదేశాలతో విచారణ చేపట్టారు కమిటీ సభ్యులు రంగారెడ్డి జిల్లా (డీసీఎచ్ఎస్)డాక్టర్ అనురాగిని రెడ్డి షాద్ నగర్ ఆసుపత్రికి వచ్చి డాక్టర్ సుప్రజా పై వచ్చిన పిర్యాదులపై జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఈ నెల 17 న ఆర్టీసీ బస్సు దిగుతూ కిందపడి గాయలతో ఆసుపత్రి కి వచ్చిన మహిళ వాంతులు చేసుకుంటుంటే కూడా చికిత్స అందించకుండా మొబైల్ ఫోన్లు మాట్లాడుతూ చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఆమెకు ఏం కాలేదనీ అస్సలు ప్రాబ్లమే లేదని ఇలాంటి కేసులు నేను చాలా చూశానని నా తలలో ఎన్ని వెంట్రుకలు ఉన్నాయో అన్ని కేసులు ఇలాంటివి చూశానని నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు తదనంతరం ఆ మహిళా అపస్మారక స్థితిలోకి వెళ్ళడం వాంతులు చేసుకోవడం గమనించినా కుటుంబ సభ్యులు వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు అక్కడ తలకు తగిలిన గాయం కు ఆపరేషన్ చేయడంతో ప్రాణాపాయం నుండి బయటపడింది కానీ పూర్తి స్థాయిలో ఆమెకు మాటలు రావడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు..పేద ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..లిప్రభుత్వాసుపత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందించాలి.! పేద ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యులపై ఉన్నత స్థాయి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందించాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు జర్నలిస్ట్ మిద్దెల సత్యనారాయణ ఆందోళనకు దిగారు పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందక ఎంతో మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఓవైపు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులు విచ్చలవిడిగా వెలుస్తున్న క్రమంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం మెరుగైన సౌకర్యాలు కనిపించడం లేదని దాంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు నిరాశే ఎదురవుతుందని ప్రభుత్వం స్పందించి మెరుగైన సౌకర్యాలతో కూడిన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

## 108 అంబులెన్స్ లో ప్రసవం”

- 108 అంబులెన్స్ సిబ్బందికి కృతజ్ఞతలు



**నారాయణపేట జిల్లా :** మక్తల్ మండలంలోని అడవి సత్యారం గ్రామానికి చెందిన %బా%, రేణుక తనకు నాలుగవ కాన్పు నిమిత్తం,పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 కి సమాచారం అందించింది, సమాచారం అందుకున్న 108 సిబ్బంది అంబులెన్స్ పదినిమిషాల్లో, సంఘటన స్థలానికి చేరుకొని, మార్గమధ్యలో వాడ్వాట్ గేట్ దగ్గర అంబులెన్స్ లోనే” మగ బిడ్డ జన్మించింది.టెక్నీషియన్ రామాంజనేయులు , డాక్టర్ వినయ్ గారి సూచనలతో అంబులెన్స్ లోనే డెలివరీ చేయడం జరిగింది, తర్వాత వారిని మాగనూరు %ూఎజ% ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేయడం జరిగింది, అక్కడ డ్యూటీలో ఉన్న వైద్యులు పరీక్షించి, అత్యవసర సమయంలో 108 సిబ్బంది సకాలంలో స్పందించి తల్లి బిడ్డ ప్రాణాలు కాపాడారని వైద్యులు మరియు పేషంట్ బంధువులు 108 సిబ్బందిని అభినందించారు

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**తొర్రూరు :**లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో శనివారం సూర్య సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వైద్యులు లయన్ డాక్టర్ సునీల్ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో మండలంలోని మాటేడు జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 30 మంది విద్యార్థినీ,విద్యార్థులకు రూ.12 వేల విలువ గల ఆల్ ఇన్ వన్ పుస్తకాలు,రూ.2 వేల విలువ గల ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో కూర్చోవడానికి రూ.2వేల విలువగల టార్పాలిన్ ను అందజేశారు. ఈ సందర్భంగా డెంటల్ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ విద్యార్థులు దంతాలు పాడు కాకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.పాఠశాల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్య క్రమంలో క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, ప్రధానోపాధ్యాయులు కె.ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం తైతెలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో నాణ్యమైన సేవలందించాలి

- తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ కమలాదేవి





**తొర్రూరు :**అంగన్వాడి కేంద్రాలలో పిల్లల హాజరు శాతాన్ని పెంచి చిన్నారులు, గర్భిణీలు,బాలింతలకు నాణ్యమైన సేవలందించాలని తొర్రూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ కె.కమలాదేవి కోరారు.శనివారం మండల కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్ లో ప్రాజెక్టు పరిధిలోని.తొర్రూరు,పెద్దవంగర,నెల్లికుదురు మండలాల అంగన్వాడి టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ కమలాదేవి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ఎడ్యుకేషన్, హెల్త్, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్వాడి కేంద్రాల పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని, షెడ్యూల్ ప్రకారం ఆన్ లైన్ ద్వారా హాజరు వివరాలు పరిశీలించాలని, ఉదయం 9 నుండి 4 గంటల వరకు తెరిచి ఉంచాలని,పిల్లలు, గర్భిణీ, బాలింతలకు అందించే పోషకాహారంసకాలంలో అందించాలని,టైం టేబుల్ ప్రకారం ప్రీస్కూల్ కార్యక్రమాలు జరగాలని, పిల్లలకు జరిపే ఆకలి పరీక్ష వారికి ఇచ్చే ఆహారంపై సరైన దృష్టి పెట్టి సరైన విధంగా అందించాలని, పిల్లలకు మూడు రోజుల లోపు ఆకలి పరీక్ష నిర్వహించి మెడికల్ అసెస్మెంట్ కి పంపించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పోషణ పథకాలపై రూపొందించే కార్యక్రమాలను పక్కగా నిర్వహించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, కోడిగుడ్లు, బాలామృతం, బియ్యం, ఆహార పదార్థాలు పిల్లలు, గర్భిణీ, బాలింతలకు సక్రమంగా అందించి పిల్లలకు బేసిక్ లెర్నింగ్ ఎడ్యుకేషన్ ను పూర్తిస్థాయిలో అందించేందుకు టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్వాడి టీచర్లు పర్మిషన్ లేకుండా గైర్హాజరు కావద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓలు విజయలక్ష్మి,బి.సంకీర్తన, సూపర్వైజర్లు శ్రీదేవి, గౌస్య, సునీత, శోభ, నాగమణి, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
అక్టోబర్ 26, 2025



# ఆఖిరి వన్డేలో భారత్ ఘన విజయం

- టీమ్ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శన
- 38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో విధ్వంసం
- కోహ్లీ అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు





ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌ను భారత్ విజయంతో ముగించింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో టీమ్ఇండియా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఘన విజయం సాధించింది. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ (121), విరాట్ కోహ్లీ (74) చెలరేగడంతో 237 పరుగుల లక్ష్యాన్ని భారత్ 38.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆసీస్ బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్ 1 వికెట్ దక్కించుకున్నాడు. సెంచరీతో కదం తొక్కిన రోహిత్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. 237 లక్ష్య ఛేదనను రోహిత్- గిల్ ధాటిగానే ఆరంభించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (24), రోహిత్ బౌండరీలు బాదడంతో జట్టు స్కోర్ 10 ఓవర్లకు 60 దాటింది. ఈ దశలో గిల్‌ను హేజిల్‌వుడ్ ఔట్ చేశారు. ఆ తర్వాత ఆసీస్‌కు మరో వికెట్ దక్కలేదు. విరాట్ కోహ్లీతో రోహిత్ చాలా రోజుల తర్వాత భారీ పార్ట్‌నర్‌షిప్ నిర్మించాడు. ఈ ఇద్దరూ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తు స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలోనే రోహిత్ సెంచరీ, విరాట్ హాఫ్ సెంచరీ పూర్తి చేశారు.వన్డేల్లో హిట్‌మ్యాన్‌కు ఇది 33వ శతకం కావడం విశేషం. అటు విరాట్‌కు ఇది 75వ వన్డే హాఫ్ సెంచరీ. సెంచరీ తర్వాత రోహిత్ స్పీడ్ పెంచాడు. మ్యాథ్యూ షార్ట్ వేసిన 38వ ఓవర్లో రోహిత్ సిక్స్, ఫోర్ బాదగా, ఆ తర్వాతి ఓవర్లో విరాట్ బౌండరీ కొట్టి మ్యాచ్‌ను ముగించాడు. రో- కో జోడీ ఈ ఇన్నింగ్స్‌తో అభిమానులకు ట్రీట్ ఇచ్చింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 169 బంతుల్లో 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు ఆసీస్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్(29), మిచెల్ మార్ష్(41) శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించిన అనంతరం సిరాజ్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి పవర్ ప్లేలో ఆసీస్ వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. అనంతరం మాథ్యూ షార్ట్‌తో కలిసి మిచెల్ మార్ష్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశాడు. కానీ హాఫ్ సెంచరీకి చేరువైన అతన్ని అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేసి పెవిలియన్ చేర్చాడు. ఆ కాసేపటికే మాథ్యూ షార్ట్(30)ను వాషింగ్టన్ సుందర్ ఔట్ చేయగా.. అలెక్స్ క్యారీ(24)ని శ్రేయస్ అయ్యర్ స్టన్నింగ్ క్యాచ్‌తో హర్షిత్ రాణా ఔట్ చేశాడు. ఈ క్యాచ్ అందుకునే క్రమంలో అయ్యర్ పక్కటెముకలకు తీవ్ర గాయమైంది. ఓవైపు వికెట్లు పడినా మరోవైపు మ్యాచ్ రేన్‌షా 48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతన్ని వాషింగ్టన్ సుందర్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. ఆ వెంటనే మిచెల్ ఓవెన్‌ను హర్షిత్ రాణా ఔట్ చేయగా.. మిచెల్ స్టార్క్‌ను కుల్దీప్ యాదవ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. నాథన్ ఎల్లిస్(16)ను ప్రసిధ్ కృష్ణ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆడమ్ జంపాతో కలిసి కూపర్ కాన్లీ కాసేపు పోరాడాడు. ప్రసిధ్ కృష్ణ బౌలింగ్‌లో బౌండరీలు రాబట్టాడు. అతనితో పాటు జోష్ హాజెల్ వుడ్(0)ను ఔట్ చేసిన హర్షిత్ రాణా ఆసీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. 237 పరుగుల స్వల్ప లక్ష్యఛేధనలో టీమిం డియాకు శు భారంభం దక్కింది. శుభ్‌మన్ గిల్(24) త్వరగానే ఔటైనా... తొలి వికెట్‌కు 69 పరుగుల భాగస్వామ్యం లభించింది. క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీతో కలిసి రోహిత్ శర్మ చెలరేగాడు. 63 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగాడు. 56 బంతుల్లో కోహ్లీ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. రోహిత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకు న్నాడు. 105 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

# వన్డేల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన కోహ్లీ



భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ వన్డే క్రికెట్ చరిత్రలో మరో అరుదైన మైలురాయిని అధిగమించాడు. ఆస్ట్రేలియాతో సిడ్నీలో జరిగిన మూడో వన్డేలో అద్భుతమైన హాఫ్ సెంచరీ నమోదు చేసిన కోహ్లీ, శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర రికార్డును బద్దలు కొట్టి వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ ఘనత సాధించడం ద్వారా కోహ్లీ తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ తర్వాత నిలిచిన ఏకైక ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన ఆఖరి వన్డేలో మెరుపు హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా విరాట్ కోహ్లీ.. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర పేరిట ఉన్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ మ్యాచ్‌కు ముందు కోహ్లీ సంగక్కర రికార్డును బ్రేక్ చేయడానికి 54 పరుగులు చేయాల్సి వచ్చింది. కుమార సంగక్కర 404 వన్డేల్లో 14,234 పరుగులు చేశాడు. కోహ్లీ తన 293వ వన్డే ఇన్నింగ్స్‌లోనే 14,255లి పరుగులు చేసి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతను అజేయంగా 74 పరుగులు చేసి, భారత్‌కు 9 వికెట్ల విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ ఇప్పుడు తన ఆరాధ్యదైవం సచిన్ టెండూల్కర్ వెనకే నిలిచాడు. సచిన్ టెండూల్కర్ 452 ఇన్నింగ్స్‌లలో 18,426 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. కోహ్లీ సాధించిన ఈ రికార్డుకు అతని అద్భుతమైన యావరేజ్ బలం. వన్డే చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన టాప్ 10 బ్యాటర్లలో 50 కంటే ఎక్కువ సగటు (దాదాపు 57.69) ఉన్న ఏకైక ఆటగాడు కోహ్లీ కావడం విశేషం. సచిన్ సగటు 44.83గా ఉంది. వన్డేలు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిపి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో కూడా కోహ్లీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు.ఈ ప్రదర్శనతో కోహ్లీ వన్డే ఫార్మాట్‌లో 75వ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అంతేకాకుండా, ఆస్ట్రేలియాపై వన్డేలలో 2500 పరుగులు పూర్తి చేసుకున్నాడు. రోహిత్ శర్మతో కలిసి 168 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి

# సమష్టి ప్రదర్శనతోనే విజయం

- రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ అద్భుతం
- టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్



సమష్టి ప్రదర్శనతోనే ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డేలో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. ఇది పర్‌ఫెక్ట్ గేమ్ అని, కెప్టెన్‌గా ఈ విజయం తనకు ప్రత్యేకమైనదని తెలిపాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో భారత్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది.టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో టీమిండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. సంతోషం వ్యక్తం చేశాడు. రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ అద్భుతమని, బౌలింగ్‌లో హర్షిత్ రాణా స్పిన్నర్లు రాణించారని కొనియాడాడు. 'మాకు ఇది పర్‌ఫెక్ట్ గేమ్. మిడిల్ ఓవర్లలోనే మ్యాచ్‌పై పట్టు బిగించాం. ఛేజింగ్ చూడముచ్చటగా అనిపించింది. మా స్పిన్నర్లు పరుగులు ఇవ్వకుండా కట్టడి చేశారు. పేసర్లు కీలక వికెట్లు తీసారు. మిడిల్ ఓవర్లలో హర్షిత్ రాణా వేగంగా బౌలింగ్ చేశాడు. ఇలాంటి క్వాలిటీ బౌలింగ్ మాకు అవసరం. రోహిత్, కోహ్లీ చాలా ఏళ్లుగా ఇలాంటి విజయాలు అందించారు. వారి ఆటను చూడటం చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రత్యేకమైన మైదానంలో ఈ విజయం దక్కడం గొప్ప విషయం'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆసీస్ 46.4 ఓవర్లలో 236 పరుగులకు ఆలౌటైంది. మ్యాట్ రేన్‌షా(58 బంతుల్లో 2 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిచెల్ మార్ష్(41), మాథ్యూ షార్ట్(30) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా(4/39) నాలుగు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. వాషింగ్టన్ సుందర్(2/44) రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్ 38.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 232 పరుగులు 69 బంతులు మిగిలి ఉండగానే సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(24) మరోసారి విఫలమవ్వగా.. ఆసీస్ బౌలర్లలో జోష్ హాజెల్ వుడ్ ఒక వికెట్ పడగొట్టాడు. సెంచరీతో చెలరేగిన రోహిత్ శర్మ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ లభించింది. బుధవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది.

# మిడిలార్డర్ వైఫల్యంతోనే ఓటమి

- ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్



మిడిలార్డర్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. టీమిండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. ఈ ఇద్దరి సూపర్ బ్యాటింగ్‌తో టీమిండియా చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా ఆసీస్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది.ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన మిచెల్ మార్ష్.. అద్భుతమైన ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయామని చెప్పాడు. రోహిత్, కోహ్లీ అసాధారణ ప్రదర్శన కనబర్చారని కొనియాడాడు. 'గత 10 ఏళ్లుగా రోహిత్, విరాట్ కోహ్లీలు చాలా జట్లపై మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయడం చూశాం. ఈ మ్యాచ్‌లోనూ వారు అదే తరహా ప్రదర్శన కనబర్చారు.మా బ్యాటింగ్‌లో మరో భాగస్వామ్యం నమోదు చేస్తే ఫలితం మరోలా ఉండేది. 3 వికెట్లకు 195 పరుగులతో గొప్ప ప్లాట్ ఫామ్ దొరికింది.

# మేం మళ్లీ ఆడుతామో లేదో తెలియదు

- రోహిత్ శర్మ సంచలన వ్యాఖ్యలు

తాను, విరాట్ కోహ్లీ మళ్లీ ఆస్ట్రేలియా పర్యటనలో ఆడుతామో లేదో తెలియదని టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. కానీ ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన ప్రతీ క్షణాన్ని ఆస్వాదించామని హిట్ మ్యాన్ చెప్పుకొచ్చాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి వన్డేలో రోహిత్ శర్మ(125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్స్‌లతో 121 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. విరాట్ కోహ్లీ(81 బంతుల్లో 7 ఫోర్లతో 74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో రాణించాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ఈ విజయానంతరం దిగ్గజ క్రికెటర్లు రవి శాస్త్రి, ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లతో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాకు హిట్ మ్యాన్ ధన్యవాదాలు తెలిపాడు.'నాకు ఆస్ట్రేలియా పర్యటనకు రావడం ఎప్పుడూ ఇష్టమే. సిడ్నీ వేదికగా ఆడటం సంతోషంగా ఉంటుంది. నా తొలి ఆసీస్ పర్యటన 2008 నుంచి మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ పర్యటన కూడా చాలా సరదాగా గడిచింది. మేం మళ్లీ క్రికెటర్లుగా ఆసీస్‌కు వస్తామో లేదో తెలియదు.

నిజాల నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక





## ఖైదీ-2 సీక్వెల్‌లో బిజీగా లోకేశ్ కనగరాజ్

దర్శకుడు లోకేష్ కనగరాజ్ చివరిగా రజనీకాంత్ హీరోగా కూలీ అనే సినిమా చేశాడు. అతని గత సినిమాలతో పోలిస్తే, ఆ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేదు. చెప్పుకోదగ్గ కలెక్షన్స్ వచ్చాయి, కానీ లోకేష్ కెరీర్‌లోనే అది వీకెస్ట్ వర్క్ అనే ముద్ర పడింది. ఈ సినిమా తర్వాత కమల్ హాసన్, రజనీకాంత్ కలిసి చేస్తున్న సినిమా కూడా లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేస్తాడని అందరూ భావించారు. అయితే, అది నిజం కాదని తర్వాత తెలిసింది. అయితే, ఎట్టకేలకు మరోసారి రజనీకాంత్ అనే సినిమా చేసి హిట్ కొట్టాలని ఆయన ప్రయత్నం చేసినట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే, ఆ వార్తలన్నీ కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. తాజాగా అందుతున్న సమాచారం మేరకు, లోకేష్ తన తర్వాతి సినిమాగా కార్తి హీరోగా నటించిన ఖైదీ సినిమాకి సీక్వెల్‌గా ఖైదీ 2 చేయబోతున్నాడు. ఈ సినిమా లోకేష్ కనగరాజ్ సినిమాకి యూనివర్స్‌లో భాగంగా ఉండబోతోంది. ఈ సినిమాకి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు మొదలైనట్లుగా అధికారిక సమాచారం. కార్తి హీరోగా వచ్చిన ఖైదీ సినిమా అప్పట్లో పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అయింది. దానికి సీక్వెల్‌గా ప్లాన్ చేస్తున్నా, ఖైదీ 2 ఎలా ఉండబోతుందా అని ఆసక్తి రేగుతోంది.

## పురుషాధిక్యంలో మౌనమే సమాధానం

### కాజోల్ టాక్ షోలో జాన్వీ ఆసక్తికర విషయాలు

పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సిందేనని నటి జాన్వీకపూర్ అభిప్రాయపడ్డారు. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్శకనిర్మాత కరణ్‌జోహార్‌తో కలిసి జాన్వీ సందడి చేశారు. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తంచేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది. దీనికి చాలా నేర్పు ఉండాలి. నేను ఈ విషయంలో ఎన్నో పోరాటాలు చేశాను. ఒక్కోసారి మనల్ని మనం తక్కువ చేసుకోవాలి. ఎంత గొప్పగా నటించే సామర్థ్యం ఉన్నప్పటికీ అవతలి వారి కోసం కొంచెం తగ్గి నటించాల్సి వస్తుంది. అలాగే మరికొన్నిసార్లు మనకు నచ్చని విషయాలను 'ఇది నాకు నచ్చలేదు.. నేను చేయను' అని చెప్పే బదులు.. నాకు అర్థం కావడం లేదు అని చెప్పాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఎన్నో రాజకీయాలను ఎదుర్కోవాలని జాన్వీకపూర్ చెప్పారు. ఈ విషయాలన్నీ ఆ షో వ్యాఖ్యాతల్లో ఒకరైన ట్వింకిల్ ఖన్నా అంగీకరించారు. తాను కూడా 1990ల్లో పరిశ్రమలో ఉన్నప్పుడు ఇలాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయం తనకు ఇప్పటికీ అర్థం కాదని పేర్కొన్నారు. ఇటీవల కూడా జాన్వీకపూర్ నెపోటిజం గురించి తన అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారు కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయన్నారు. ప్రస్తుతం రామ్‌చరణ్-బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న 'పెద్ది'లో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న థియేటర్లలోకి రానుంది.



## రాజాసాబా ప్రమోషన్‌లో కొత్త ఒరవడి


### ప్రత్యేకంగా షూట్ చేస్తున్న ప్రమోషన్ వీడియో

ప్రభాస్ అభిమానులకు, సినీ ప్రేక్షకులకు ఒక ఆసక్తికరమైన వార్త తెర మీదకు వచ్చింది. 'రాజా సాబ్' సినిమా విడుదలకు ముందు చిత్ర యూనిట్ మరో ట్రైలర్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. అయితే, ఈసారి ట్రైలర్ విషయంలో దర్శకుడు మారుతి ఒక సరికొత్త పద్ధతిని అనుసరించబోతున్నారు. సాధారణంగా సినిమాలలోని కీ షాట్స్‌తో ట్రైలర్ కట్ చేస్తుంటారు. కానీ, 'రాజా సాబ్' కోసం విడుదల చేయబోయే ఈ రెండో ట్రైలర్‌ను సినిమాలోని సన్నివేశాలతో కాకుండా, దీనికోసం స్పెషల్‌గా షూట్ చేయాలని దర్శకుడు మారుతి భావిస్తున్నారు.

ఈ స్పెషల్ వీడియో ప్రమోషనల్ వీడియోలా ఉంటూనే, పూర్తిస్థాయి ట్రైలర్ అంత ఎఫెక్ట్‌ను కలిగించేలా డిజైన్ చేయబోతున్నారు. ఓ రకంగా చూస్తే, సినిమా ప్రమోషన్స్‌లో 'రాజా సాబ్' తో ఒక కొత్త ట్రెండ్ మొదలు కావచ్చు. అయితే ఇది పూర్తిగా కొత్త స్ట్రాటజీ అని చెప్పలేం. ఎందుకంటే సినిమా మీద ఆసక్తి కలిగించేలా ఉన్నా కొన్ని డైలాగ్స్, షాట్స్ తో చేసిన కొన్ని ట్రైలర్స్ ఇప్పటికే రిలీజ్ చేసి తర్వాత సినిమాలో అవి లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ సినిమా విషయంలో కూడా దాదాపుగా అదే స్ట్రాటజీ ఫాలో అవ్వబోతున్నారు. ఈ వినూత్న ప్రమోషనల్ స్ట్రాటజీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.








## రెండులారీల థాంక్స్.. అల్లు అర్జున్‌కు శివ రిప్లై

నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం శివ నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ ప్రత్యేక వీడియో విడుదల చేశారు. తెలుగు ఇండస్టీ గురించి చెప్పాల్సి వస్తే.. 'శివ'కు ముందు.. తర్వాత అని చెబుతారని అన్నారు.



## పెళ్లి విషయంలో ఓపెన్ అయిన ముద్దుగుమ్మ

మలయాళ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం పూర్తి చేసుకుంది. 2015 సంవత్సరంలో మలయాళం మూవీ ప్రేమమ్‌తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేసింది. కెరీర్ ఆరంభంలో ఈ అమ్మడు మలయాళ సినిమాలకే పరిమితం అవుతుందని అంతా అనుకున్నారు. కానీ లక్కీగా ఈ అమ్మడికి మొదటగా తమిళ్‌లో కోడి అనే సినిమాలో ఛాన్స్ దక్కింది. ఆ సినిమా తర్వాత తెలుగులో అ ఆ, ప్రేమమ్ సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు చేరువ అయింది. టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే మంచి స్టార్డం దక్కించుకుంది. అ ఆ సినిమాలో అనుపమ నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో అంతా ఆమెను అభిమానించడం మొదలు పెట్టారు, ఆ తర్వాత ప్రేమమ్ సినిమా ఆమె స్థాయిని మరింతగా పెంచేసింది. ప్రేమమ్‌తో టాలీవుడ్‌లో ఎంట్రీ తెలుగులో ఈమె 2017లో చేసిన శతమానం భవతి సూపర్ హిట్ కావడంతో వెనక్కి తిరిగి చూసే అవకాశం రాలేదు. ఇప్పటికీ టాలీవుడ్, కోలీవుడ్, మలయాళం ఇలా అన్ని భాషల సినిమా ఇండస్ట్రీలోనూ సినిమాలు చేస్తూ బిజీ బిజీగా ఉంది. దక్షిణాదిన అన్ని భాషల్లో నటించిన హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నిలిచింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం కావడంతో లేడీ ఓరియంటెడ్ సినిమాలకు సైతం ఈమెకు ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె పరదా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మంచి కాన్సెప్ట్‌ను చూపించినా కమర్షియల్‌గా నిరాశ పరిచింది. అయినా కూడా ఈ అమ్మడి క్రేజ్ తగ్గలేదు. ప్రస్తుతం ఈ అమ్మడి చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఒకటి రెండు షూటింగ్ దశలో ఉంటే కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నట్లుగా సమాచారం అందుతోంది. అనుపమ పరమేశ్వరన్ పెళ్లి విషయంలో... ఈ ఏడాది ఏకంగా ఆరు సినిమాలతో వచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తన పెళ్లి విషయమై ఓపెన్ అయింది. మూడు పదుల వయసుకు చేరువ అవుతున్న నేపథ్యంలో అనుపమ పరమేశ్వరన్ పెళ్లి ఎప్పుడు అంటూ చాలా మంది అడుగుతూ ఉన్నారు. ఆ మధ్య అనుపమ పరమేశ్వరన్ ప్రేమలో ఉందనే వార్తలు తెగ వచ్చాయి. కానీ అవి పుకార్లే అని ఆ తర్వాత క్లారిటీ వచ్చింది. అనుపమ పరమేశ్వరన్ ఇటీవల ఒక చిట్ చాట్ సందర్భంగా ప్రేమ వివాహం గురించి స్పందించి అందరిని సర్‌ప్రైజ్ చేసింది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com